22-07Pg1exHMNWJQEBPR:Layout 1 22/07/23 11:57 PM Page 1

మెయిల్ గత వారం రోజులపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

అనంతపురం : fb.com/vaartha

PUBLISHED FROM ANANTAPUR, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

22-7-2023 శనివారం సంపుటి : 29 సంచిక : 172, పేజీలు : 08+4 వెల : 6.50

## లలితసంగీత విద్వాంసుడు చిత్తరంజన్ ఇకలేరు

2లో

## రాజ్యసభ ప్యానెల్ వైస్‌చైర్మన్‌గా విజయసాయి



శుక్రవారం పోలవరం వద్ద వరద ఉధృతి దృశ్యం



ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గరిష్ట స్థాయికి చేరుకున్న వరద

## ధవళేశ్వరం బ్యారేజ్ 175 గేట్లు ఎత్తివేత

### మొదటి ప్రమాద హెచ్చరిక వద్ద నిలకడగా వరద

**ధవళేశ్వరం,జూలై 21, ప్రభాతవార్త:** అఖండ గోదావరికి వరదల సీజన్ గత యేడాదితో పోలిస్తే ఈ సీజన్ ఆలస్యంగా మొదలైంది.గత నాలుగు రోజులనుండి అల్పపీడన ప్రభావంతో గోదావరి వరద ఉధృతి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి వరకు వచ్చినా, వరద ఉధృతి శుక్రవారం సాయంత్రం నుండి నెమ్మదిగా తగ్గుతూ వస్తోంది.భద్రాచలంలో గురువారం సాయంత్రం నాలుగు గంటల నుండి 43.70 అడుగులకు చేరుకుని మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరి,అనంతరంశుక్రవారం ఉదయం గం:11లు నుండి ≫2

## పేదల ఇళ్ల నిర్మాణం కేసులో హైకోర్టు తీర్పు వాయిదా




**విజయవాడ,జూలై21,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో సీఆర్డీఏ పరిధిలోని ఆర్‌జోన్ -5 భూముల్లో పేదలకు ఇళ్ల నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై ఏపీ హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.ఆర్‌జోన్-5 భూముల్లో నివేశన స్థలాలు కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ,.స్టేను కోరుతూ ఏపీ హైకో ర్టు,సుప్రీం కోర్టులను అమరావతి ప్రాంత రైతు లు ఆశ్రయించారు.అయితే వారికి ప్రతికూలరీ తిలో ఉభయకోర్టులు తీర్పును ఇచ్చాయి.దీంతో ఈ ప్రాంతంలో పేదలకు భూములను ఏపీ ప్రభు త్వం ఇళ్ళ స్థలాలను కేటాయించింది.ఇక్కడ ఇళ్ళ నిర్మాణానికి సన్నద్ధమవుతుంది.దీనిపై రైతులు హైకోర్టును ఆశ్రయించారు.సుప్రీం కోర్టు ఇళ్ళ నిర్మాణానికి అనుమతిని ఇవ్వలేదని వారు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు.ఇళ్ళను నిర్మించకుండా న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వాలని కోరారు.జీవో నెంబరుపై 45పై హైకోర్టు,సుప్రీంకోర్టు స్టే ఇవ్వ లేదని, కాబట్టి నిర్మాణాలు చేసుకోవచ్చని అర్థమని ప్రభుత్వ న్యాయవాదులు తమ వాదనను ధర్మాసనానికి వివరించారు.గత ప్రభుత్వం ఇక్కడ 1652 ఎకరాలను విక్రయిస్తే స్పందించన వారు. పేదలకు ఇళ్ళస్థలాలను ఇచ్చి,ఇళ్ళు నిర్మించి ఇస్తుంటే అడ్డుకుంటున్నారని న్యాయవాదులు వాదనలు విన్పించారు.ప్రతివా దులన్యాయ వాదులు ఈ భూములను రైతులు పూర్తిగా సీఆర్డీఏకి అప్ప గించలేదనివాదించారు. భూ ములపై ప్రభుత్వానికిగాని,సీఆర్డీఏకిగాని హక్కులేదని వాదించారు. ఉభయ వర్గాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పునురిజర్వు చేసినట్లు ప్రకటించింది.

# బాబు వద్ద వలంటీర్‌గా పవన్



శుక్రవారం చేనేత కార్మికుల ఖాతాల్లో నేతన్న నేస్తం నగదు బటన్ నొక్కి జమ చేస్తున్న సీఎం జగన్

### సిఎం జగన్ ఎద్దేవా

### దత్తపుత్రుని అసత్యప్రచారాన్ని ఎవరూ నమ్మరు

### వెంకటగిరిలో ఐదోవిడత 'నేతన్న నేస్తం' నగదు బటన్ నొక్కి జమచేసిన సిఎం

**వెంకటగిరి, జులై 21, ప్రభాతవార్త:** మాజీ సీఎం చంద్రబాబునాయుడు దగ్గర దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ వలంటీరుగా పని చేస్తున్నారని సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలో ఐదో విడత నేతన్న నేస్తం నగదు ల్యాప్‌టాప్ బటన్‌నొక్కి చేనేత కార్మికుల ఖాతాల్లో శుక్రవారం జమచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల నుండి దత్తపుత్రుడు బాబుకు వలంటీరుగా పని చేస్తున్నట్లు విమర్శించారు. దత్తపుత్రుడు బాబు దగ్గర ప్యాకేజీ తీసుకొని విమర్శలు చేస్తున్నట్లు తెలిపారు. దుష్ట చతుష్టాలు ప్రభుత్వం, తమ మంత్రులు, ఎమ్మెల్యేలపై దుష్ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. వలంటీర్లను దత్తపుత్రుడు విమర్శించడం విచారకరమన్నారు. వలంటీర్లు అవ్వ తాతల వద్దకు వెళ్లి చిరునవ్వుతో ప్రతినెల ఒకటో తేదిన సూర్యోదయం ముందే పెన్షన్లు పంపిణీ చేస్తారని తెలిపారు. వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. వైసీపీ ప్రభుత్వంపై కట్ట కట్టుకొని కొంత మంది అసత్య ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వారి అసత్య ప్రచారాల్నినమ్మరని చెప్పారు. 2024 ఎన్నికల్లో దత్తపుత్రుడు టీడీపీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నిటినీ నెరవేర్చినట్లు తెలిపారు. చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. వైసీపీది సంక్షేమ ప్రభుత్వం అని, టీడీపీది సంక్షభ ప్రభుత్వం అని తెలిపారు. బీసీలు వెనుకబడిన వారు కాదని, బ్యాక్‌బోన్ లాంటివారని తెలిపారు. చేనేత పరిశ్రమ వలన దేశానికి మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. చేనేత కార్మికులకు ఇప్పటివరకు నాలుగు దఫాలు ఖాతాలో జమచేసినట్లు చెప్పారు. ఇప్పుడు ఐదవ దఫా ఖాతాలో జమ చేస్తున్నట్లు వివరించారు. 80 వేల మంది చేనేత కార్మికులకు 193 కోట్ల 63 లక్షల రూపాయలు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. చేనేత కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు ≫2

# వివేకా హత్యకు అవినాశ్, భాస్కర్ రెడ్డి కుట్ర



### ఛార్జిషీట్‌లో వెల్లడించిన సిబిఐ

### 259వ సాక్షిగా షర్మిల

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్యకు కడప ఎంపి అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డిలు కలిసి కుట్ర పన్నారని సిబిఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో వుంది. గత జూన్ నెల 30వ తేదీన ఈ ఛార్జిషీట్‌ను సిబిఐ అధికారులు నాంపల్లి సిబిఐ కోర్టులో దాఖలు చేయగా దీనికి సంబంధించిన విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఈ ఛార్జిషీట్‌లో అనేక అంశాలను ప్రస్తావిం చిన సిబిఐ అధికారులు ఇదే సమయంలో వై.ఎస్ షర్మిల వాంగ్మూలాన్ని తీసుకోవడంతో పాటు ఆమెను 259వ సాక్షిగా పరిగణించారు. ఆమెతో పాటు ఎపి సిఎం జగన్ ఓఎస్‌డి కృష్ణమోహన్ రెడ్డి, ఎపి విశ్రాంత సిఎస్ అజయ్ కల్లాం సహా మరికొందరి సాక్ష్యాలను సిబిఐ తన ఛార్జిషీట్‌లో పొందుపరిచింది.

వివేకా హత్య కేసులో సిబిఐ విచారణ ముగింపు దశకు చేరుకున్న తరుణంలో గత నెల దాఖలు చేసిన ఛార్జిషీట్‌లోని అంశాలు రాజకీయంగా ప్రకంపనలు రేపుతున్నాయి. వివేకా హత్య కేసులో అవినాష్ రెడ్డి ఆయన తండ్రి భాస్కర్ రెడ్డిల పాత్ర వుందని మొదటి నుంచి చెబుతూ వచ్చిన సిబిఐ దీనికి అనుగుణంగానే ఛార్జిషీట్‌లో వీరి గురించి అనేక వివరాలను పొందు పరచింది. వివేకా హత్యకు అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డిలు కుట్ర పన్నారనేది ముమ్మాటికీ వాస్తవమని, ఇందుకు సంబంధించి అన్ని ఆధారాలు తమ వద్ద వున్నాయని సిబిఐ పేర్కొంది. వివేకా హత్యకు కుట్ర పన్నడంతో పాటు సాక్ష్యాల చెరిపివేతకు అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డిలు పాల్పడ్డారని సిబిఐ తన ఛార్జిషీట్‌లో వెల్లడించింది. ఈ క్రమంలోనే వివేకా హత్య కేసులో ఉదయ్ కుమార్ రెడ్డిని ఎ6గా, భాస్కర్ రెడ్డిని ఎ7గా అవినాష్ రెడ్డిని ఎ8గా చేర్చామని సిబిఐ పేర్కొంది. రాజకీయ కారణాలతోనే వివేకా హత్య జరిగిందని సిబిఐ పేర్కొంది. కడప జిల్లా రాజకీయాల్లో వివేకా చురుకైనపాత్రపోషిస్తుండడంతో అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి ≫2




## సోలార్ పరిశ్రమలో విరిగిపడిన మట్టిపెళ్లలు

### ఇద్దరు కార్మికులు దుర్మరణం

### మరో నలుగురికి తీవ్రగాయాలు



**నంద్యాల, జూలై 21, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురం ప్రాంతంలో ఉన్న సోలార్ పరిశ్రమలో శుక్రవారం మట్టిపెళ్ళలు పడి ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఫ్యాక్టరీలో జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు గత కొన్ని నెలలుగా ఆ పరిశ్రమలో పనిచేస్తున్నారు. శుక్రవారం పనిచేయడానికి టన్నల్‌లోకి ప్రవేశించిన కార్మికులు ఐదుమంది ముందుగానే లోపలికి వెళ్లారని మరో ఇద్దరు వెళ్తుండగా మట్టి పెళ్లలుపడి అక్కడికక్కడే మృతిచెందారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మోనో బిక్ బొక్తా (42) సోనా బోక్తా (33)అనే కార్మికులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయినట్లు తెలుస్తోంది. మరికొంతమంది ≫2



## రోడ్డుప్రమాదంలో యువకుని మృతి

### కాన్వాయ్ నుంచి దిగి మానవత్వం చాటుకున్న మంత్రి సురేష్

**ప్రభాతవార్తప్రతినిధి, ఒంగోలు:** కొద్దిక్షణాల ముందు జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడిని చూసి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి చలించిపోయి కాన్వాయ్ దిగి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఒంగోలులో జరిగే ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు మంత్రి మార్కాపురం నుంచి ఒంగోలుకు బయలుదేరారు.మార్గమద్యంలోని పేర్నమిట్ట వద్ద కొద్దిక్షణాల ముందు జరిగిన రోడ్డు ప్రమాదంలోఓయువకుడు మృతిచెంది రోడ్డుపై ≫2

వార్త

స్నేహితుడైనప్పటికి అవినీతిపరుడైతే సలహాదారునిగా వినియోగించుకోరాదు.

-చాణక్యుడు

# అరాచకానికి పరాకాష్ట!

శాంతిలేనిదే అభివృద్ధిలేదు. ఎంత అభివృద్ధి చేసినా, మరెన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా శాంతిభద్రతలు లోపించిన నాడు అన్నీ బూడిదలో పోసిన పన్నీరే అవుతాయి. శాంతిభద్రతలు క్షీణిస్తే అరాచకమే ప్రబలుతుంది. ఆ అరాచకంలో కూడా ప్రస్తుతం మణిపూర్‌లో జరిగిన, జరుగుతున్న సంఘటనలు పరాకాష్టగా చెప్పొచ్చు. సభ్యసమా జం తలవంచుకునేలా వ్యవహరించారు. దారుణమైన ఈ సంఘటన యావత్ భారత్‌ను కుదిపేసింది. గురువారం అటు పార్లమెంట్‌లోనూ, ఇటు దేశ అత్యున్నత న్యాయస్థానంలో ప్రస్తావనకు వచ్చింది. మణిపూర్‌లో కుకీ గిరిజన తెగకుచెందిన ఇద్దరి మహిళలను నగ్నంగా ఊరేగించి ఆ తర్వాతవారిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన సంఘటనపై సుప్రీంకోర్టు ఆగ్రహావేశాలు వ్యక్తంచేసింది. మరొకపక్క పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో తొలిరోజే ఉభయ సభల్లో ఆగ్రహజ్వాలలు పెల్లుబుకి సభా కార్యక్రమాలను స్తంభింపచేశాయి. దేశవ్యాప్తంగా ఈఘోర సంఘటనపై తీవ్ర నిరసనలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రెండో రోజుకూడా ఇదే సంఘటనపై పార్లమెంటులో విపక్షాల నినాదాలహోరుతో ఎలాంటి చర్చ చేపట్టకుండానే వాయిదాపడింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ గురువారం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటు సమావేశాల ప్రారంభానికి ముందు ఆయన విలేకరులతో ఆవేదనాభరితంగా మాట్లాడారు. మణిపూర్‌లో వెలుగుచూసిన సంఘటన సభ్యసమాజానికి తలవంపుస్తున్నదని ఈ పాపంనేరం ఎవరు చేసినా మొత్తం దేశానికే అపఖ్యాతి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 140 కోట్ల మంది ప్రజలు సిగ్గుపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి సంఘటనలు ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్,మణిపూర్‌లోనేకాదు దేశంలో ఏ రాష్ట్రంలో చోటుచేసుకున్నా రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.నేరస్తులు ఎవ్వరూ తప్పించుకోలేరనే హామీ ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇక దేశంలో అన్నిరాజకీయ పార్టీలు ఈ సంఘటనను తీవ్రంగాఖండించాయి. అయితే ఇలాంటి సంఘటనలు అక్కడ ఎన్నిజరిగాయో, ఎందరు బలయ్యారోఅనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మే నాలుగో తేదీన జరిగిన ఈ దారుణం మొన్న బుధవారం వెలుగులోకి వచ్చింది.వాస్తవంగా గత రెండు నెలలుగా రెండు తెగల మధ్య హింస కొనసాగుతున్నది. తమపై హింసకుపాల్పడే అవకాశం ఉందని సమాచారం అందుకున్న కుకీలకు చెందిన ఒక కుటుంబం మే మూడోతేదీ రాత్రి తప్పించుకోవడానికి సమీపంలోని అరణ్యంలోకి వెళ్లేందుకు ఇంటిబయటకు వచ్చినట్లు సమాచారం. అప్పటికే ఆ ప్రాంతంలో రెండు తెగల మధ్య ఆ ప్రాంతంలో హింసరాజుకుంది. కుకీలే లక్ష్యంగా మైతీలు విరుచుకుపడబోతున్నారని సమాచారం అందడంతో గ్రామంలోని కుకీలంతా సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. అందులో భాగంగానే యాభైయేళ్ల వ్యక్తి మరో పంతొమ్మిదేళ్ల యువకుడు మరో ఇద్దరు మహిళలు అడవిలోకి పారిపోయే ప్రయత్నంలో ఉండగా అల్లరిమూకలు చుట్టుముట్టాయి. మహిళలను వివస్త్రలను చేశాయి. వారిముందే వారితండ్రిని, తమ్ముడిని దారుణంగా చంపేశారు.ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి ఆపై అత్యాచారం చేసినట్లు కథనాలు వెలువడ్డాయి.ఇదంతా పోలీసులు చూస్తున్నామౌనంగా ఉన్నారనే స్వయంగా బాధితులే వాపోతున్నారు. అయితే ఫిర్యాదు లేదనే కారణంతో కేసు నమోదు చేయలేదు.ఈ సంఘటన వెలుగులోకి రావడంతో జూన్ 30న కేసు నమోదుచేశారు. కానీ ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధితులను వైద్యపరీక్షకు తరలించే తదితర చర్యలేమీ తీసుకోలేదు.ఈ దారుణ వీడియోబయటకు వచ్చాక పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టుచేశారు. ఈవీడియో వెలువడకపోతే అరెస్టులు,కేసులు ఏమీ ఉండకపోయేవనే విమర్శలకు జవాబులేదనే చెప్పొచ్చు.మణిపూర్‌లో అల్లర్లు మొదలైనప్పటి నుండి ఇప్పటివరకు 142 మందికిపైగా చనిపోయినట్లు మొన్న నాలుగో తేదీన కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. 181 మందిని అరెస్టు చేసినట్లు ఆ నివేదికలో వెల్లడించింది.అసలు ఇలా వెలుగు చూడని కేసులు ఎన్ని ఉన్నాయో అంతుపట్టడం లేదు.వీడియో ఆధారంగానే గురువారం దేశఅత్యున్నత న్యాయస్థానం సుమోటోగా కేసు నమోదుచేసి విచారణచేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై చంద్రచూడ్,జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ మనోజ్‌మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది.మణిపూర్‌లో జరిగిన అమానవీయ సంఘటన తమను తీవ్రంగా కలచివేసిందని, ఇలాంటి దారుణాలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదంది.ఈ ఉదంతంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తగిన రీతిలో స్పందించకుంటే సుప్రీంకోర్టే చర్యలు చేపడుతుందని హెచ్చరించింది. మరొకపక్క ఈ సంఘటనకు నిరసనగా మణిపూర్ సిఎం బీరేన్‌సింగ్ రాజీనామా చేయాలంటూ విపక్షాలు పట్టుబడుతున్నాయి. ప్రధానసూత్రధారి హీరాదాస్‌తోపాటు మరో నిందితుడిని అరెస్టు చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. మిగతా నిందితులకోసం పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారని, నిందితులకు మరణశిక్ష విధించేలాచర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఏదిఏమైనా ఈ సంఘటనపట్ల దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పోలీసులవైఫల్యం స్పష్టంగా కన్పిస్తున్నది. పోలీసులన్నా, చట్టమన్నా భయభక్తులు లేనప్పుడే నేరస్తులు ఇలాంటి అరాచకాలకుపాల్పడతారు. మణిపూర్‌లో అదే జరిగింది. ఇలాగే పరిస్థితులు కొనసాగితే ఇలాంటి దారుణ సంఘటనలు ఆ రాష్ట్రంలోనే కాదు ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించే అవకాశాలున్నాయి. రాజకీయాలకు అతీతంగా అందరూ ఆలోచించాల్సిన తరుణమిది. మాటల్లో కాకుండా చేతల్లో చూపాలి.

భగవంతుడు బంధువులను ఇస్తాడు. కానీ మిత్రులను ఎన్నుకునే అవకాశం మనకే ఇచ్చాడు. దానిని సద్వినియోగం చేసుకున్నవాడే సుఖంగా జీవిస్తాడు.



నేతాజి

నీ తప్పులను, నీ తెలివి తక్కువ పనులను నీ ముందు నిదానంగా నివేదించేవాడే నిజమైన స్నేహితుడు.



జాన్ రస్కిన్

## ప్రజావాక్కు

### మణిపూర్ దైన్యం, హైన్యం

**ఇద్దరు** మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్న గుంపునిచూపిస్తూ ఒక వీడియో సామాజిక మాధ్య మంలో వైరల్ అయింది. అది మణిపూర్‌లో రెండు నెలల క్రితం జరిగిన హీన చర్యగా తెలియవచ్చింది. దేశం యావత్తూ అక్కడ జరుగుతున్న అమానవీయ దృష్టాంతాల్ని నేరుగా చూసి దిగ్భ్రాంతి చెందింది. నిజంగా ఈ ఘటన మన సుల్ని కలచి వేసిన హేయమైన చర్య. అయినా ఇంతవరకూ చట్టంవైపునుండి ఎలాంటిస్పందన లేకపోవడంఅక్కడి దుస్థితికి అద్దంపడుతుంది. ఇప్పుడు ఈవీడియో ద్వారా బయట ప్రపంచానికి తెలిసిన పిమ్మటసమాజం నుండి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్న వేళ ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని చెప్తున్నారు. అన్నింటికీ మించి తమని పోలీసులే ఆ గుంపుకి అప్పగించారంటూ ఒక బాధిత మహిళ చెప్పడం తీవ్ర అభిశంసనీయం.ప్రభుత్వాలు చేతులెత్తేసే తామే న్యాయం చేస్తామంటూఅత్యున్నత న్యాయస్థానం ఆగ్రహంతో చెప్పడాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్థం చేసుకుని మత్తు వదలాలి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం పరిస్థితిని అదుపు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వపు వైఫల్యాన్ని కప్పిపుచ్చి ఉంచడంలో అర్థం లేదు.

-డా.డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

### వైఖరి మారాలి

**మోడీ** పేరు ఉన్న వారందరిని ఏకం చేసి ఒక మాట అన్నందుకు బిజెపివాళ్లు రాహుల్ గాంధీపై కక్షగట్టారు. ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దుచేసి కోర్టులచుట్టూ తిరిగేలా చేస్తున్నారు. మహిళలపై లైంగిక వేధింపులు జరిపి వారిని మానసిక క్షోభకు గురిచేసిన తమ పార్టీఎమ్‌పిపై చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారు.బిజెపి నాయకులు ఆయన పట్ల ఉదాసీన వైఖరిని ప్రదర్శిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆయన్ని రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. స్వపక్షం వారిని రక్షించడం, విపక్షం వారిని శిక్షించడం ఇలా చేయడం న్యాయమేనా? తమకోనీతి పరులకో నీతి అనేదే బిజెపి సిద్ధాంతమా?

-మిథునం, హైదరాబాద్

### పదోన్నతులు ఇవ్వాలి

**రాష్ట్రంలోని** టీచర్లకు పదోన్నతులు ఇవ్వాలి.ఇప్పటికే ఉపాధ్యాయులు అసంతృప్తిగా ఉన్నారు. రేపు, మాపు అంటూ కాలయాపన జరుగుతూ ఉంది. బదలీల మీద స్టే కొనసాగుతున్న క్రమంలోమొత్తం ప్రక్రియ నిలిచిపోయింది. అన్ని పాఠశాలల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధికారులు స్పందించి బదలీలు, పదోన్నతులు నిర్వహించాలి.

-కె.సతీష్, భూపాలపల్లిజిల్లా

### ఉచిత విద్యుత్‌పై ఎందుకు లొల్లి

**ఉమ్మడి** ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నాన్నాళ్లు రైతులనిపట్టించుకోలేదు. ఉచిత విద్యుత్ ఊసేఎత్తలేదు. రైతులకు ఉచితవిద్యుత్ ఇమ్మనిఅడిగితే సాధ్యం కాదన్నారు. పైగా అలాఅడిగిన వారిని ఎగతాళి చేశారు. పరిహాసంగామాట్లాడారు.అయితే ఎవరెన్నివిమర్శలు చేసినా హేళనగా మాట్లాడినా కాంగ్రెస్ పార్టీలెక్క చేయలేదు. అధికారంలోకి వస్తే రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చి తీరుతామని హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసి మాటనునిలుపుకుంది. ఇప్పుడు ఆపార్టీ అదే మాట అంటోంది. తెలంగాణ రైతులకు ఉచిత విద్యుత్ ఖచ్చితంగా ఇచ్చి తీరుతామని, కాని బిఆర్ఎస్ నాయకులు మంత్రులు రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరిస్తున్నారు. ఆయన ఒకటంటే వాళ్లు ఇంకేదో అన్నాడంటు గోరంతను కొండంత చేస్తున్నారు.

-దివ్య, హైదరాబాద్

### రాకపోకలు బంద్

**వర్షాలు** పడితేచాలు వంశధార నదీతీరప్రాంత వాసులకు ముఖ్యంగా భామిని మండలం వాసులకు ముంపు భయం తప్పడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను సైతం నష్టపోవాల్సి వస్తోంది. వరద తీవ్రత తగ్గుముఖం పట్టేవరకూ బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. గత నాలుగేళ్లలో కరకట్టల నిర్మాణంపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించకపోవడం వలన ముంపు ప్రాంతాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. గతంలో చేసిన కరకట్టల పనులు నదీతీరంలో వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. దీంతో వంశధారకు వరదలు వస్తే కీసర, కోసలి జంటగ్రామాలు, బిల్లుమడ, సింగిడి, లివిరి, ఘనసర, తదితర గ్రామాలు యేటా ముంపునకు గురవుతున్నాయి. ఆయా ప్రాంతాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వయోపరిమితికి ప్రాధాన్యం ఇవ్వాలి

**తెలంగాణ** రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ కళాశాలలో, గురుకులాలలో, కాంట్రాక్టు లెక్చరర్స్, గెస్ట్ ఫ్యాకల్టీ, పార్ట్‌టైం టీచింగ్ స్టాఫ్‌ల నియామకాలలో ఎస్సీ,ఎస్టీ బిసి వికలాంగులకు తగిన విద్యార్హతతోపాటుగా పరిశోధనాఅంశాలలోప్రాధాన్యంకల్పించాలి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితి దాటిపోతున్న సీనియర్స్‌కు అవకాశాలు ఇవ్వాలని అదేవిధంగా ప్రభుత్వఉద్యోగాల భర్తీ కోసంబ్యాక్‌లాగ్‌ఉద్యోగాలను కూడాభర్తీచేయాలి.ఎంప్లాయిమెంట్ సీనియారిటీ ప్రకారం ఉపాధి అవకాశాలు ఇవ్వాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు,వరంగల్ జిల్లా

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# ఈ కంచి గరుడ సేవ ఇంకెన్నాళ్లు?

*అసలు ఈ శిక్షణల కంటే క్రమశిక్షణ పాటించని నేతలకు శిక్ష తప్పదనే సంకేతాలు స్పష్టంగా ఇవ్వాలి. క్రమశిక్షణారాహిత్యం అనేది ఈ పార్టీ, ఆపార్టీ అనికాదు అన్ని పార్టీల్లోనూ అంతర్భాగం అయిపోయింది. అయితే కొన్ని పార్టీల్లో కొద్దిగా తక్కువ శాతం ఉండొచ్చు. మరికొన్ని పార్టీల్లో ఎక్కువ ఉండొచ్చు. ఏదిఏమైనా కార్యకర్తల విషయంలో అన్ని పార్టీలు ఆలోచించాల్సిన సమయమిది. దశాబ్దాల తరబడి అటూ ఇటూ చూడకుండా పక్కదారి తొక్కకుండా పార్టీద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్న నిజమైన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాలి. కార్యకర్తలే పార్టీకి పునాదులనే విషయాన్ని విస్మరించరాదు. కార్యకర్తలు లేని పార్టీ పునాదులు లేని భవనంలాగా కూలి కనుమరగయ్యేలా పార్టీకూడా ఉనికిని కోల్పోక తప్పదు.*

దామెర్ల సాయిబాబ

'కూడు, గుడ్డ అడక్కపోతే బిడ్డను సాకినట్లు సాకుతా' అన్నట్లుగా ఉంది కార్యకర్తల పట్ల రాజకీయ పార్టీల వైఖరి. శిక్షణాతరగతులు అంటారు, ధర్నాలంటారు, రాస్తారోకోలంటారు, సభలు, సమావేశాలకు ప్రజలను తరలించుకురావాలంటారు. స్థానికంగా పార్టీ కార్యక్రమాలు చేపట్టి విధానాలను ప్రజల్లోకి తీసుకుపోయి పార్టీ ప్రతిష్టకు కృషి చేయాలంటారు. ఇలా ఒకటేమిటి యేడాది పొడవునా ఏదో ఒక కార్యక్రమం ఏ ర్పాటు చేస్తూనే ఉంటారు. పోని ఒక్కయేడాదితో ముగిసిపోయేది కాదు. నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ప్రధానంగా నాయకులు సమావేశాలకు జనాన్ని తరలించుకురావడం కార్యకర్తలకు తలకుమించిన భారంగా పరిణమిస్తున్నది. సమావేశాలకు వచ్చే వారికి భోజనం, రవాణాతోపాటు కొంత మొత్తం కూడా చెల్లించాల్సిన పరిస్థితులు కొన్ని ప్రాంతాల్లో నెలకొన్నాయి. ముఖ్యనాయకులు వచ్చినప్పుడు జనాన్ని తరలించేందుకు వాహనాల సేకరణ, అందులో జనాన్ని ఎక్కించడం, వారిని తీసుకువెళ్లి, మళ్లీ తిరిగి గ్రామానికి తీసుకువచ్చి వదిలిపెట్టేంత వరకు బాధ్యత వహించాల్సి వస్తుంది. ఇందులో కొంత ఆర్థిక భారం స్థానిక నేతలు భరించినా జనసేకరణ మాత్రం రానురాను సమస్యగానే మారిపోతున్నది. ఏ పార్టీ సమావేశాలకు అయినా ముఖ్యమంత్రులు, చివరకు ప్రధానమంత్రి ప్రసంగించే సమావేశాలకు కూడా ప్రజలు తమంతటతాము వచ్చేరోజులు పోయాయి. ఈ కార్యక్రమాలు విజయవంతం చేయడం ఎంత వ్యయప్రయాసలతో కూడిందో ఒక్కసారి మనసుపెట్టి ఆలోచిస్తే నాయకులకే బోధపడుతుంది. ఇలాంటి కార్యక్రమాలు రానురాను పెరిగిపోతుండడం కార్యకర్తల్లో ఈ కంచి గరుడ సేవ ఇంకెన్నాళ్లనే నైరాశ్యం పెరిగిపోతున్నది. దీనికితోడు వారి కుటుంబ సభ్యులు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ తట్టుకుని అంతోఇంతో ఆర్థికంగా ఖర్చుపెట్టుకొని పార్టీకి సేవలు అందించినా ఏనాటికి తమకు గుర్తింపు ఇస్తారో? అసలు గుర్తింపుపొందే యోగం తమకు ఉందా? అనే వారి సంఖ్య పెరిగిపోతున్నది. యేళ్లకొద్దీ, దశాబ్దాల కొద్దీ చేస్తూనే ఉండాలి. అలా చేసిన వారు చేస్తున్నవారు ఎందరో ఉన్నారు. పైకి ఏమనలేకపోయినా ఏన్నాళ్లీ కష్టమనుకునేవారి సంఖ్య రోజురోజుకు ఎక్కువైపోతున్నది. అయినా ఏనాటికైనా తమ సేవలను గుర్తించలేకపోతారా? ఏదోపదవి రాకుండాపోతుందా? అనే ఆశతో ఈరాజకీయ యజ్ఞంలో పోరాటం చేస్తూనే ఉన్నారు. ఎందరో కార్యకర్తలు పార్టీకోసం ఇల్లు, ఒళ్లు గుల్లయినా లెక్కచేయకుండా కొనసాగుతూనే ఉన్నారు. అయితే ఇలా గతంలో కార్యకర్తలుగా రాజకీయజీవనం ప్రారంభించిన వారెందరో సర్పంచ్‌లుగా, మండలాధ్యక్షులుగా, శాసనసభ్యులుగా, ముఖ్యమంత్రులుగా కేంద్రమంత్రులుగా ఎదిగిన పెద్దలు ఎందరో మన తెలుగు రాష్ట్రాల్లో కూడా ఉన్నారు. ఇందుకు ఎందరినో ఉదహరించవచ్చు. దీనికితోడు కొత్తపార్టీలు ఉద్భవించినప్పుడు పార్టీల నాయకుల మధ్య వైరుధ్యాలు పెరిగి పోటీ తీవ్రమైనప్పుడు కార్యకర్తలుగా సేవలు అందించి ప్రజాభిమానం పొందినవారు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి అధికార, ప్రతిపక్షపార్టీల అభ్యర్థులను మట్టికరిపించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కాంగ్రెస్‌పార్టీ విడిపోయి ఇందిరాకాంగ్రెస్ ఏర్పడినప్పుడు నాయకులు కరవై, కార్యకర్తలే ,అందులోనూ మూడు, నాలుగు కిందిస్థాయిలో ఉన్నవారు సైతంనాయకత్వం వహించి ప్రజాభిమానం పొంది పెద్దపెద్ద పదవులకు ఎదిగారు.ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలోనూ ఎంతోమంది కార్యకర్తలు నాయకులుగా ఉద్భవించారు. ఇక తెలంగాణరాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆ ఉద్యమంలోపాల్గొన్న వారితోపాటు సాధారణ కార్యకర్తలు కూడా నాయకులయ్యారు. కానీ రానురాను పరిస్థితులు మారిపోతున్నాయి.ప్రజాసేవ, ప్రజాభిమానం వంటి కొలమానాలతో పదవులకు ఎంపిక చేసే కాలం చెల్లిపోయింది. రాజకీయమే ఒకవ్యాపార రంగంగా రూపు దాల్చింది. పెట్టుబడి పెట్టడం, ఎన్నికల్లో గెలవడం, తమ పెట్టుబడిని రాబట్టుకోవడం, మళ్లీ పెట్టుబడి...ఒక విషవలయంగా ఏర్పడింది. ఆర్థిక, అంగబలం ఉన్నవారు మాత్రమే ఈ వలయంలో నెగ్గుకురాగలుగుతున్నారు. సామాన్య కార్యకర్తలు ఆవైపు కన్నెత్తి చూసే ధైర్యం కూడా చేయలేకపోతున్నారు. దీనికితోడు తమ కుటుంబ

## ఒక్క మాట

సభ్యులనో,బంధువులనో రంగంలోకి దించడం కొందరి నాయకులకు పరిపాటిగా మారిపోయింది. ఇదేమీ కొత్తవిషయం కాదు. పేర్లు రాసి ఇబ్బందిపెట్టడం ఎందుకు కానీ వారసత్వరాజకీయాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి.ఈ దురదృష్టపు పరిస్థితుల్లో శిక్షణలు, ఉపన్యాసాలంటూ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం? సొంత పనులు మానుకొని, ఖర్చులు పెట్టుకొని ఈ శిక్షణాశిబిరాలకు సామాన్యకార్యకర్తలు రావాలంటే వారి ఆర్థిక పరిస్థితి ఏమిటి?ఎన్నాళ్లు ఈ వ్యయప్రయాసాలు భరించగలుగుతారనేది జవాబులేని ప్రశ్నలే. నిజంగా సొంత డబ్బులు వెచ్చించి ఎంత మంది కార్యకర్తలు ఈ శిక్షణాశిబిరాలకు హాజరవుతున్నారనే విషయం పరిశీలిస్తే కొన్నివాస్తవాలు తెలుస్తాయి.పోని ఇంతటి శిక్షణలు ఇచ్చి కార్యకర్తలుగా, నాయకులుగా తయారు చేస్తే వారు ఏమైనా అంటిపెట్టుకొని ఉంటారా అనేవిషయం చెప్పక్కర్లేదు. అసలు నిజంగా శిక్షణఇవ్వాల్సివస్తే ముందుగా పదవులు వెలగబెట్టి పార్టీ ప్రతి ష్టను, పరువును బజారులో పెడుతున్న పడకకుర్చీ నాయకులకు ఇవ్వాలి.పార్టీలోనే ఉంటూ గోతులు తవ్వే నాయకులకు ఇవ్వాలి. అవకాశం రాకపోతే కప్పదాట్లకు సిద్ధపడే నేతలకు ఇవ్వాలి. ఎన్ని శిక్షణలు ఇచ్చినా, మరెన్ని కార్యక్రమాలు చేపట్టినా ఈ కప్పదాట్లను ప్రోత్సహించినంతకాలం ఇవన్నీ నిరుపయోగమే. ఈ పార్టీ, ఆపార్టీ అనికాదు. అధికారం కోసం ఆరాటపడే ప్రతి పార్టీది ఇదే పరిస్థితి. గత సాధారణ ఎన్నికల్లో ఆయా పార్టీల టిక్కెట్లపై గెలిచిన వారు ఎంతమంది పార్టీలు ఫిరాయించారో వేరే చెప్పక్క ర్లేదు. అన్నింటికంటే ఆశ్చర్యకరంగా క్రమశిక్షణ, తమపార్టీ సిద్ధాం తాలు,నిబద్ధత గురించి వేదికలెక్కి ఉపన్యాసాలిచ్చిన పెద్దలే చొక్కా మార్చినంత తేలికగా పార్టీలు మార్చేస్తున్నారు.అంతవరకు ఆ పార్టీల్లోనే ఉండి అధినేతను, పార్టీ సిద్ధాంతాలను నెత్తినపెట్టుకొని మోసిన పెద్దలే తెల్లవారేసరికి పార్టీలు మార్చేస్తున్నారు.మొత్తం మీద దేశవ్యాప్తంగా కూడా రాజకీయాల్లో యువత భాగస్వామ్యం తగ్గిపోతున్నది. భారత రాజ్యాంగంలోని 112వ సవరణ బిల్లు 2009లో లోక్‌సభలో ఆమోదంపొందిన తర్వాత స్థానిక సంస్థల్లో మహిళలకు యాభై శాతం రిజర్వేషన్ కల్పించే అవకాశాలు దక్కాయి. దాని ఫలితంగా క్రమేపీ రాజకీయాల్లో మహిళల సంఖ్య పెరుగుతూనే వస్తుంది. కానీ యువత విషయంలో చట్టసభలకు పోటీ చేసే అవకాశాలు దక్కడం లేదని భారత ఎన్నికల సంఘం గణాంకాలు చెబుతున్నాయి. డేటా ఇంటెలిజెన్స్ యూనిట్ 2019 నివేదిక ప్రకారం తెలంగాణలో 45శాతం, జార్ఖండ్‌లో 39 శాతం, హర్యానాలో 36శాతం, యువ అభ్యర్థులు రంగంలోకి దిగారు. నలభైయేళ్లలోపు వారిలో ఎక్కువశాతం స్వతంత్ర అభ్యర్థులే ఉన్నారు. కానీ ప్రధాన రాజకీయపార్టీల నుంచి పోటీ చేసిన వారిలో యువతరం సంఖ్య అతి తక్కువగా ఉంది. వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ప్రధాన పార్టీలు యువతరానికి కల్పించిన అవకాశాలు పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో 19 శాతం, ఒడిశాలో 16 శాతం, మహారాష్ట్రలో 15శాతం, బీహార్‌లో 14శాతం, జార్ఖండ్‌లో 13 శాతం, హర్యానాలో 11 శాతం మాత్రమే యువకులున్నారు. ఎన్నికల్లో యువతకు తగిన న్యాయం చేయడం లేదని స్పష్టమవుతుంది. ఈ పరిస్థితుల దృష్ట్యా చాలా పార్టీల్లో కార్యకర్తలు వైరాగ్యంతో కొందరు, ఆగ్రహంతో మరికొందరు, ఆవేదనతో ఇంకొందరు డీలాపడిపోతున్నారు. అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు ఇందుకు భిన్నంగా లేరు. అటు ఆంధ్రప్రదేశ్‌లో కానీ, ఇటు తెలంగాణలో కానీ పాలకులు ఎన్నో పథకాలు, మరెన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నా కార్యకర్తల ద్వారా అవిఅంతగా ప్రచారానికి నోచుకోవడం లేదు. ఆశించిన మేరకు ప్రజల్లోకి వెళ్లడం లేదు. ఎన్నికలప్పుడే గుర్తుకువస్తాం, ఇప్పుడు తమతో పనేమిటని కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. అసలు ఈ శిక్షణల కంటే క్రమశిక్షణ పాటించని నేతలకు శిక్ష తప్పదనే సంకేతాలు స్పష్టంగా ఇవ్వాలి. క్రమశిక్షణారాహిత్యం అనేది ఈ పార్టీ, ఆపార్టీ అనికాదు అన్ని పార్టీల్లోనూ అంతర్భాగం అయిపోయింది. అయితే కొన్ని పార్టీల్లో కొద్దిగా తక్కువ శాతం ఉండొచ్చు. మరికొన్ని పార్టీల్లో ఎక్కువ ఉండొచ్చు. ఏదిఏమైనా కార్యకర్తల విషయంలో అన్ని పార్టీలు ఆలోచించాల్సిన సమయమిది. దశాబ్దాల తరబడి అటూ ఇటూ చూడకుండా పక్కదారి తొక్కకుండా పార్టీద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్న నిజమైన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాలి. కార్యకర్తలే పార్టీకి పునాదులనే విషయాన్ని విస్మరించరాదు. కార్యకర్తలు లేని పార్టీ పునాదులు లేని భవనంలాగా కూలి కనుమరగయ్యేలా పార్టీకూడా ఉనికిని కోల్పోక తప్పదు. ●

# మానవత్వానికి మాయని మచ్చ మణిపూర్ ఘటన!

డాక్టర్ కోలాహలం రామ్‌కిశోర్

మణిపూర్‌లో పరిపాలన చేతకాక, శాంతి భద్రతలు నశిస్తుంటే గత రెండు నెలలుగా బిజెపి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మౌనం వహించి నీచ రాజకీయం చేస్తున్నాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన వీడియోలు, అసాంఘిక శక్తుల దురాగాతాలను స్పష్టంగా చూపుతున్నాయి. ప్రజల ధన,మాన, ప్రాణాలను రక్షించాల్సిన పోలీసులు, పారామిలటరీ దళాలు చేష్టలుడిగి చోద్యం చూస్తున్నాయి. మణిపూర్‌లో స్త్రీల మానాలకు, పురుషుల ప్రాణాలకు రక్షణలేకుండా పోయింది. మణిపూర్‌లో మానవత్వం మంటకలిసింది. పశుప్రవర్తన పెచ్చుపెరిగింది.' మైనార్టీలకు మన దేశంలో రణక్ష లేదు ' అని ఈ వీడియోలు ప్రపంచానికి ఎలుగెత్తిచాటుతున్నాయి. ఒక్క బిజెపి పాలనలో తప్ప గతంలో ఎన్నడూ మనదేశ ప్రతిష్ట ఇంతగా దిగజారలేదు. మణిపూర్‌లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బిజెపి ఆధీనంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కారే పాలిస్తుంది. వారి పాలనలో ప్రభుత్వ అనుకూల మూకలు పశుప్రవర్తనతో ప్రజాస్వామ్య వ్యవస్థకే మాయని మచ్చ తెస్తున్నారు. మణిపూర్‌లో ముగ్గురు గిరిజన స్త్రీలను అల్లరిమూకలు గుంపులుగా చుట్టుముట్టారు. కర్రలు, కత్తులు, ఆయుధాలు ధరించి, వారిని వివస్త్రలను చేసి, వీధులలో తోసుకుంటూ బహిరంగంగా ఊరేగిస్తూ పొలాలలోకి ఈడ్చుకుంటూపోతున్న దృశ్యాలు ఈ వీడియోలో కనపడుతున్నాయి. అక్కడ ఆ స్త్రీలపై సామూహిక మానభంగాలు చేశారు. వారిలో 21 సంవత్సరాల కాలేజీలో చదువుకుంటున్న అమ్మాయి కూడా ఉంది అని వార్తలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఆమె సోదరుడికి 19 సంవత్సరాల వయసు ఉంటుంది. అతడిని కూడా కొట్టి హింసించి చంపేశారు. రాక్షసులు కూడా ఇంత నీచానికి వడిగట్టరు. మణిపూర్ గత రెండు నెలలుగా తగలబడుతుంటే బాధ్యత లేని ప్రధాని ఎన్నికల ప్రచారాలకు విదేశీ పర్యటనలకు వెళ్లడం,దానికి దేశం, విదేశాల్లో బిజెపి అనుకూలవర్గాలు జేజేలు పలకడం అమానుషత్వానికి పరాకాష్ట. కనీసం ప్రధాని బాధితులను ఓదార్చలేదు. వారికి ధైర్యం చెప్పలేదు. శాంతి భద్రతలపై సమీక్షచేయలేదు. మణిపూర్‌ను వదిలి ఇతర ప్రాంతాలకు ప్రాణభయంతో వలసలు పోతున్నవారికి భరోసా కల్పించలేదు. పోలీసులకు మార్గదర్శకత్వం చూపలేదు. మణిపూర్‌లో గత రెండు నెలలుగా హింసా సంఘటనలు చెలరేగుతూనే ఉన్నాయి. గృహదహనాలు కొనసాగుతున్నాయి. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు అహాకారాలు చేస్తున్నారు. స్త్రీలపై హత్యాచారాలు కొనసాగుతున్నాయి. పోలీసుల కాల్పుల్లో 86 మంది పైచిలుకు మరణాలు సంభవించాయి. మరో గుజరాత్ మారణకాండను మరిపించేలా మైనార్టీ గిరిజనులపై సామూహిక హింసాకాండ జరుగుతూనే ఉంది. తమను రక్షించమని, తమ ప్రాణాలను కాపాడమని భగవంతుణ్ణి వేడుకుంటున్న వందలాది క్రైస్తవులపై పోలీసులు లాఠీఛార్జీ చేశారు. వారి వందలాది ప్రార్థనా మందిరాలైన చర్చిలను ధ్వంసం చేశారు. హిందూ మతంమత్తులో హింస హద్దులుదాటింది. ఇప్పుడు వెలుగులోకి వచ్చిన వీడియోల ఆధారంగా కేంద్ర ప్రభుత్వంపై సుప్రీకోర్టు ఘాటైన హెచ్చరికలు చేసింది. ఇకనైనా మోడీ ప్రభుత్వం కనీసం స్పందిస్తుందా? ఈ దురాగాతాలకు బాధ్యత వహిస్తుందా? లేదా ఎప్పటి మాదిరిగానే 'దున్నపోతు మీద వర్షం పడినట్లు' స్తబ్దంగా, మౌనంగా ఉండి పోతుందా? వేచిచూడాలి. ఈ విషయంలో సుప్రీంకోర్టు సుమోటోగా కేసును తీసుకొని, మణిపూర్ సంఘటనలపై తన ప్రత్యక్ష పర్యవేక్షణలో సత్వరవిచారణ జరిపించి దోషులను కాలయాపన లేకుండా కఠినాతికఠినంగా శిక్షించాలి. మణిపూర్‌లో జరిగిన, జరుగుతున్న అరాచకత్వంపై మానవతా వాదులు, ప్రజాస్వామిక వాదులు మనుషులుగా స్పందించాలి. అసమర్థ బిజెపి పాలనను ఐక్యంగా ఎండగట్టాలి. దేశ విదేశీ (ప్రింట్, ఎలక్ట్రానిక్) మీడియా కళ్లు తెరవాలి. సోషల్‌మీడియా ప్రజాపక్షం వహించి మణిపూర్ దురాగతాన్ని ఖండించాలి. ఇలాంటి సంఘటనలు దేశంలో మరో చోట జరగకుండా చర్యలు తీసుకోవాలి. ●

# ప్లాస్టిక్‌పై నిషేధం అమలు ఎక్కడ?

డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి

ప్రపంచవ్యాప్తంగా యేడాదికి 400 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ తయారుకావడం, అందులో సగానికిపైగా ప్లాస్టిక్ ఒకేసారివాడి పారవేస్తూ (సింగిల్ యూజ్),10శాతం తిరిగి వాడుకోవడం ( రీసైకిల్), 20మిలియన్ టన్నుల ప్లాస్టిక్ చివరికి నదులు,సరస్సులు, సముద్రజలాలతో కలవడం మనకు తెలియకుండానే జరిగిపోతున్నది. మునిసిపల్ ఘనవ్యర్థాలు, ప్లాస్టిక్ ఫిలిమ్స్, మురుగునీరు, రసాయన ఎరువుల రూపంలో నేలమన్నుకాలుష్యం అవుతున్నది. తీవ్రమైన ప్లాస్టిక్ కాలుష్య ప్రమాదాన్ని గుర్తించిన అంతర్జాతీయ సమాజం ఈ యేడాది ప్రపంచ పర్యావరణ దిన 2023నినాదంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని తరిమేద్దాం అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం సముచితంగా ఉన్నది. ఔషధాలు, సౌందర్య సాధనాలు లాంటి పలుపరిశ్రమలు విరివిగా మైక్రోప్లాస్టిక్స్‌ను విచక్షణారహితంగా వాడుతున్నాయి. నేడు మానవాళి వాడుతున్న తాగునీటితోపాటు పీల్చే గాలి, నడిచే నేలలో కూడా అధిక పరిమాణంలో మైక్రోప్లాస్టిక్స్ అవశేషాలు కనిపిస్తున్నాయి. ప్రజారోగ్య పరిరక్షణ, సకల ప్రాణికోటి రక్షణ, దేశ వాసుల సంక్షేమం, దేశ సుస్థిరాభివృద్ధి,మానవాళి సుఖజీవనానికి బాటలు వేసే మార్గంగా ప్లాస్టిక్ నిషేధమనే ముఖ్య నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం సంతోషదాయకం. అతి ప్రమాదకర 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఒకేసారి వాడి పడేసే ప్లాస్టిక్) వాడకాన్ని నిషేధిస్తూ భారత కేంద్ర ప్రభుత్వం ఆలస్యంగానైనా నిర్ణయం తీసుకుంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం విధించిన 100 దేశాల జాబితాలో ఇండియా 94వ స్థానంతో చేరినట్లు అయింది.గతంలో కూడా ప్రభుత్వం ప్లాస్టిక్ నియంత్రణకు ప్రయత్నించడం జరిగినా ఆశించిన ఫలితాలు అమలులో కనిపించలేదు. భూమండలానికి జీవకోటి మనుగడకు ప్రశ్నార్థకంగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని తరుముతూ దేశంలోని 140 కోట్ల భారతీయ ప్రజల ఆయురారోగ్యాలను కాపాడడంలో ఈ నిర్ణయం ప్రముఖ పాత్రను వహిస్తుందనడంలో అతిశయోక్తి లేదు. దేశవ్యాప్తంగా మహానగరాలు, పట్టణాలు, వీధులు, నాలాలు, పల్లెలు, నదులు, మహాసముద్రాలు నేడు గరళప్లాస్టిక్ కాలుష్యంతో అకాలమరణాలు, కేన్సర్, హృదయనాళ జబ్బులు, జీర్ణకోశ వ్యాధులు, కాళ్లనొప్పులు, దీర్ఘకాలిక వాపులు, న్యూరో సంబంధ వ్యాధులు, స్ట్రోక్స్ లాంటి తీవ్ర అనారోగ్యాలు కలుగుతున్నాయి.ప్లాస్టిక్ స్ట్రాలు, థర్మకోల్, డిస్పోజబుల్ ప్లాస్టిక్, కప్స్,గ్లాసెస్, ఇయర్‌బడ్స్, ఐస్‌క్రీమ్ కప్స్, స్వీట్ బాక్సులు, కత్తులు, పివిసి బ్యానర్లు, ప్లేట్లు, స్ట్రాలు, ట్రేలు, స్పూన్లు, బెలూన్లకు వాడే ప్లాస్టిక్ స్టిక్స్, ప్లాస్టిక్ జెండాలు, ప్లాస్టిక్ అలంకార సామాగ్రి, సిగరెట్ పెట్టెలు లాంటి 19 రకాల సింగిల్ యూజ్‌ప్లాస్టిక్ వస్తువుల వినియోగ ఉత్పత్తులను నిషేధించడం ముదావహం. నేడు సింగిల్ యూజ్‌ప్లాస్టిక్ ఉత్పత్తులను



తయారుచేసినా, నిల్వ ఉంచినా, పంపిణీ చేసినా, విక్రయించినా, చట్టవ్యతిరేకం. దండనీయమని తెలుసుకోవాలి. ప్లాస్టిక్‌వ్యర్థాల నియంత్రణలో అత్యంత జాగ్రత్తలు తీసుకుంటూ ఒకేసారి వాడుకునే ప్లాస్టిక్స్‌ను నిషేధిస్తూ,ఘనప్లాస్టిక్ దిగుమతులను రద్దుచేస్తూ ప్రజారోగ్యానికి పట్టం కట్టడానికి కంకణబద్ధులం అవుదాం. ఇండియాలో యేడాదికి దాదాపు 14 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వినియోగం కావడం, అనంతరం కాలుష్యభూతంగా మారడం చూస్తున్నాం. వాడిపడేసిన జీవ విచ్ఛిన్నం చెందని ప్లాస్టిక్ వ్యర్థాలను సురక్షితంగా పారవేయగల యంత్రాంగం లేకపోవడంతో ప్లాస్టిక్ విషవ్యర్థాలతో మానవాళి సహజీవనం చేయాల్సిన అగత్యంఏర్పడింది. 1950 నుంచి నేటివరకు భారతదేశవ్యాప్తంగా 8.3 బిలియన్‌టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి కావడం, దీనిలో కనీసం 60 శాతం నేల, నీటిలో నిక్షిప్తం కావడంతో మానవ మనుగడకే ముప్పు ఏర్పడింది. ఐరాస అంచనాల ప్రకారం కనీసం 100 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర జలాలను చేరి జలచరాలకు ప్రాణాంతకంగా మారడం చూస్తున్నాం. పలు జలచరాలు, ఇతర జంతువుల శరీరాల్లోకి మైక్రోప్లాస్టిక్ చేరి అనారోగ్య కారణంగా మారడం వాస్తవమని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు జీవ విచ్ఛిన్నం కావడానికి కనీసం వంద ఏళ్లు అయినా పడుతుందని గమనించాలి. క్రమంగా దశలవారీగా డిస్పోజబుల్ ప్లాస్టిక్ వినియోగాన్ని కట్టడి చేసే ప్రయత్నాలు జోరందుకోవడం హర్షదాయకం. నేటిసమాజం విరివిగా వాడుతున్న ప్లాస్టిక్ బ్యాగులు, బాటిల్స్ నిషేధం కూడా తీసుకురావాలి. ప్లాస్టిక్ నిషేధ నిర్ణయంతో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరుగుతాయని ప్లాస్టిక్ ఉత్పత్తిదారులు కుటిల విజ్ఞపనలు చేయడం హాస్యాస్పదం స్వార్థపూరితం, ఆక్షేపణీయంగా తోస్తున్నది. అగ్నికి ఆజ్యం పోసినట్లు 2060 నాటికి 1.2 బిలియన్ టన్నుల ప్లాస్టిక్ వస్తువుల ఉత్పత్తికి శిలాజ ఇంధనాలు వాడడంతో కార్బన్ ఉద్గార సంక్షోభానికి ఊతం ఇవ్వడమే కాకుండా సాలీనా 1 బిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలకు జననానికి కారణం అవుతుందని నిపుణులు వాపోతున్నారు. ఐరాస పర్యావరణ కార్యక్రమం అంచనా ప్రకారం నిమిషానికి ఒక మిలియన్ ప్లాస్టిక్ బాటిల్స్ అమ్ముడుపోవడంతో పాటు సాలీనా ఐదు ట్రిలియన్ల ప్లాస్టిక్ సంచులు ప్రపంచవ్యాప్తంగా వినియోగించబడుతున్నాయి. మొత్తం ప్లాస్టిక్ ఉత్పత్తుల్లో 50 శాతం ఒకేసారి వాడి నిర్దాక్షిణ్యంగా పడేయడం జరుగుతోందని ప్లాస్టిక్ సమస్య ప్రపంచ సమస్యగా అవతరించడం చూస్తున్నాం. ప్లాస్టిక్ కట్టడికి ప్రపంచ దేశాలు సత్వరమే నడుం బిగించాల్సిందే. జనవరి 2022లో ఫ్రాన్స్ ప్రభుత్వం పండ్లు, కూరగాయలు, సరుకుల ప్యాకింగ్‌ల్లో ప్లాస్టిక్‌వాడకాన్ని నిషేధించడం శుభపరిణామం. నేడు భారత ప్రభుత్వం తీసుకున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని క్షేత్రస్థాయిలో కఠిన పర్యవేక్షణతో ఖచ్చితంగా అమలు చేయాల్సి ఉంది. నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 సెక్షన్ 15 ప్రకారం ఒక లక్ష వరకు ఫైన్, ఐదేళ్ల వరకు జైలు శిక్ష లేదా రెండు ఏకకాలంలో విధించవచ్చనే విషయాలను బహుళ ప్రచారం చేయాలి. ●

## నూతన ఎంపీడీఓ కట్టా వరలక్ష్మిను సన్మానించిన జెడ్పీటీసీ



నూతన ఎంపీడీఓ కట్టా వరలక్ష్మిను సన్మానించిన జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి తదితరులు

**ఉరవకొండ, జూలై 21 ప్రభాతవార్త :** మండల నూతన ఎంపీడీఓగా శుక్రవా రం బాధ్యతలను చేపట్టిన కట్టా వరలక్ష్మిను జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి దంపతులు ఘనంగా సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం స్థానిక వైసీపీ నాయకులతో కలిసి ఎంపీడీఓను మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీలు శాలువాకప్పి పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండలం అభివృద్ధి చెందాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు చెల్లూరి తిరుపాల్‌శెట్టి, మూలగిరిపల్లి ఓబన , ఏ.సి.పవన్ తదితరులు ఉన్నారు.

## ఇంటింటికీ రేషన్ పంపిణీ వాహనాల్లో పాఠ్యపుస్తకాల తరలింపు..!

**ఉరవకొండ, జూలై 21 ప్రభాతవార్త :** ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే (ఎండీయూ) వాహనాల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను అధికారులు శుక్రవారం మండల వ్యాప్తంగా పాఠశాలలకు తరలించారు. పట్టణంలోని స్థానిక ఎస్.కె. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిల్వ వుంచిన 1 నుంచి 9వ తరగతికు సంబంధించిన సెకెండ్ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు తరలించారు. 10వ తరగతికు పాత సిలబసే ఉండటంతో ఈసారి సెమిస్టర్లు లేవని విద్యాశాఖ అధికారులు తెలిపారు.



ఎండీయూ వాహనాల్లో పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు తరలిస్తున్న దృశ్యం

1 నుంచి 10వ తరగతులకు సంబంధించి పూర్తిస్థాయిలో దాదాపు లక్ష వరకు పాఠ్య పుస్తకాలు సరఫరా అయ్యాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే ఇంటింటికీ రేషన్ పంపిణీ వాహనాల్లో పుస్తకాలను తరలించడం జరిగిందని వివరించారు.

## సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టండి

**-మేజర్ పంచాయతీ కార్యాలయ సందర్శనలో ఎంపీడీఓ కట్టా వరలక్ష్మి**

**-సచివాలయం-I తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు**



సచివాలయం-1లో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ

**ఉరవకొండ, జూలై 21 ప్రభాతవార్త :** వర్షాలు కురిసి వాతావరణంలో మార్పు చోటు చేసుకొంటున్న తరుణంలో సీజనల్ వ్యాధులు



ఉరవకొండ మేజర్ పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కట్టా వరలక్ష్మి

ప్రబలే అవకాశా లు ఎక్కువగా ఉంటాయని పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి కేటాయించి మెరుగుప ర్చేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కట్టా వరలక్ష్మి సూచించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎంపీడీఓ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించగా సర్పంచ్ మీనుగ లలిత, యం బసవరాజు దంపతులు, కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ ఆమెను శాలువాకప్పి పూలమాలతో సన్మానించగా వారితో సమావేశమై పలు అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా పట్టణంలో జనాభా పారిశుధ్య కార్మికుల సంఖ్య తదితర విషయాలపై ఆరా తీసిన ఎంపీడీఓ పారిశుధ్య కార్మికులతో కొద్దిసేపు మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. చెత్తచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తూ మురుగునీటి కాలువను శుభ్రం చేసి పొడి సున్నం చల్లాని ప్రజలకు రోగాలు దరిచేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ సచివాలయం-1ను తనిఖీచేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులోవుండి మెరుగైన పౌర సేవలు అందించాలని విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు.

## చేనేత కార్మికుల సంబరాలు

**- దివంగత సీయం వైఎస్సార్ విగ్రహానికి నివాళి, సీయం వై.ఎస్.జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం**

**ఉరవకొండ, జూలై 21 ప్రభాతవార్త :** ఉరవకొండలో చేనేత కార్మికులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరుసగా 4వ సారి చేనేత కార్మికులు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద 24వేల రూపాయల సాయాన్ని బ్యాంకు ఖతాల్లో జమ చేస్తున్న సందర్భంగా ఉదయం వైసీపీ చేనేత విభాగం ఆధ్వర్యంలో



దివంగత సీయం వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న చేనేతలు

చేనేత కార్మికులు దివంగత సీయం వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అక్కడి నుండి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ సీయం వై.ఎస్.జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికులు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేనేత కార్మికులను ఆదుకోలేదని చతికిలబడిన చేనేత కార్మికుడికి నేనున్నానంటూ ప్రతి ఏడాది 24 వేల రూపాయల సాయం అందిస్తూ ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. చేనేతలందరూ జగన్ వెంటే ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందా చంద్రమ్మ, నాయకులు నిమ్మల వెంకటరమణ, యం.సి.నాగభూషణ, కరూరు వెంకటేశులు, కాసుల ఆంజినేయ ప్రసాద్, బీరే శివ, లక్కా ఎర్రిస్వామి, రఫీక్, రెడ్డి ఆంజినేయులు పాల్గొన్నారు.

## విశాల ఫెర్రర్ చేతుల మీదుగా ఆవులు పంపిణీ



లబ్ధిదారులకు ఆవులను పంపిణీ చేస్తున్న దృశ్యం

**కొత్తచెరువు, జులై 21, ప్రభాతవార్త :**
మండల పరిధిలోని మైలేపల్లి గ్రామంలో రైతు మహిళా దినో త్సవం సందర్భంగా ఆర్‌డిటి ఆధ్వర్యంలో ఆవులను పంపిణీ చేశారు. ఆర్‌డిటి మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్ చేతుల మీదుగా శుక్రవారం 32 మంది మహిళా పాడిరైతులకు వీటిని పంపిణీ చేయడం జరిగింది. చెరువు ఆయ కట్టు భూమిలో పశువుల మేత కోసం ఉమ్మడిగా బోరు వేయించి, పశుగ్రాసం పెంచుకోవడానికి వీలు కల్పించినట్లు రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఆర్‌డిటి ఎటిఎల్ సుధాకర్‌లు తెలియజేశారు. గ్రామంలోని ఎస్‌సి కుటుంబాలకు జీవనోపాధికోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలియజేశారు. పశుల దాహర్తి తీర్చే నిమిత్తం కూడా తొట్టెలను నిర్మించి ఇచ్చినట్లు తెలియజేశారు. ఈ పాడిపశువులను లబ్దిదారులు సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని వారు ఆకాంక్షించారు.

## ముఖ్యమంత్రి ఇచ్చి ఏ ఒక్క హామీ అమలు కాలేదు



అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న విఆర్‌ఎలు

**కొత్తచెరువు, జులై 21, ప్రభాతవార్త :**
రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి నాలుగు సంవత్సరాలు పూర్తయినా గ్రామ రెవెన్యూ సహాయకు లకు ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదని విఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న పేర్కొన్నారు. గత రెండు రోజులుగా తహశీల్దార్ కార్యాలయం గేటు వద్ద రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల కేంద్రంలో రెండు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా విఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికీ విఆర్‌ఎలకు ఒక్క రూపాయిని కూడా పెంచిన దాఖలాలు లేవన్నారు. విఆర్‌ఎల ప్రధాన డిమాండ్లు అయిన పేస్కేల్ అమలుచేయాలని, నామినీలుగా పని చేస్తున్నవారందరినీ విఆర్‌ఎలుగా గుర్తించాలని, అర్హులైన విఆర్‌ఎలకు ప్రమోషన్ కల్పించాలన్నారు. ప్రధానంగా డిఎ రకవరీ నిలిపివేసి, డిఎకు సమానంగా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న తమ సమస్యలపై స్పందించకపోవడంతో దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే జిల్లా స్థాయిలో ఆగస్టు 7,8 తేదీలలో కలెక్టరేట్‌ల వద్ద దీక్షలు నిర్వహిస్తున్నట్లు , అప్పటికీ స్పందించకపోతే ఆగస్టు 23,24 తేదీలలో రాష్ట్ర స్థాయిలో విజయవాడ నందు భారీ ఎత్తున నిరసన దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఆగస్టు 25వ తేదిన జగనన్నకు చెబుదాం చలో విజయవాడ భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షుడు శివ, కార్యదర్శులు ప్రసాద్, ఎస్.పెద్దన్న, చెన్నయ్య, చెన్నకేశవులు, పిట గంగాద్రి, అక్కులప్ప, నరసింహులు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## కళ్ళకు గంతలు కట్టుకొని మోకాళ్ళపై నిరసన తెలిపిన మున్సిపల్ కార్మికులు



మోకాళ్ళపై కూర్చోని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

**పుట్టపర్తిటౌన్, జులై 21, ప్రభాతవార్త**
కళ్ళకు గంతలు కట్టుకొని మోకాళ్ళపై నిలుచుకొని మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. శుక్రవారం రెండవ రోజు మున్సిపాల్ కార్యాలయం వద్ద తమ సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.ఎస్.వెంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దళిత, బడుగు బలహీన వర్గాలకు చెందిన మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో వై.ఎస్.జగన్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, సుప్రీం కోర్టు ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు ఇస్తామని హామీలు ఇచ్చాడని, అధికారంలోకి వచ్చి నాలుగున్నర యేళ్ళు అవుతున్నా పరిష్కరించలేదన్నారు. మున్సిపల్ కరాఇ్మకులు ఆనాడు కరోనా సమయంలో ప్రాణాలకు తెలగించి పారిశుధ్య పనులు చేశారని వారికి కరోనా వారియర్స్ అనే బిరుదు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. పట్టణాలు రోజురోజుకు విస్తరిస్తున్నాయని, అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. మృతి చెందిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం, రిటైరె మ్మెంట్ బెనిఫిట్స్ కల్పించిన ఫింఛన్ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ యూనియన్ నాయకులు నాగార్జున, రామయ్య, పెద్దన్న, రమణ, రమేష్, గణేష్, సత్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

## ఆర్‌టిసిలో గ్రీవెన్స్ డే

**పుట్టపర్తిటౌన్, జులై 21, ప్రభాతవార్త**
ఆర్‌టిసి ప్రజా రవాణశాఖ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ప్రతి నెలా మూడవ శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు డిపిటిఓ మధుసూధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని ఆరు డిపోల మేనేజర్‌ల స్థాయి గ్రీవెన్స్ డే నిర్వహించి ఆర్‌టిసి ఉద్యోగుల నుండి అర్జీలు సీవకరించడం జరుగుతుందన్నారు. డిపో స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు జిల్లా ప్రజా రవాణా శాఖ కార్యాలయంలో అర్జీలు ఇస్తున్నారన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులుఎదుర్కొంటున్న వివిధ సమస్యలను గ్రీవెన్స్ డే ద్వారా పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. శుక్రవారం వివిధ డిపోల నుండి మొత్తం 31 అర్జీలను సమర్పించడం జరిగిందని, వాటిని పరిశీలించి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు.

## ఎపిసిపిఎస్‌ఈఏ ఉద్యోగ సంఘం నూతన కమిటీ ఎంపిక



నూతనంగా ఎన్నుకున్న కమిటీ సభ్యులు

**గోరంట్ల,జూలై 21,ప్రభాతవార్త:**
పాత పెన్షనఖ సాధన కొరకు ఆవిర్బవించిన ఉద్యోగ సంఘం ఎపిసిపిఎస్ ఈఏ మండల శాఖ నూతన కమిటీని శుక్ర వారం ఉన్నుకున్నారు. ఈ కమిటీలో నూత నంగా ఎన్నికైన గౌరవా ధ్యక్షులు సుభాష్ నాయక్, అధ్యక్షులు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి చంద్రమౌలిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మండల సిపిఎస్ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేసే వరకు ఉద్యోగులందరి సహకారంతో పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వం కొత్తగా తెస్తున్న జిపియస్(గ్యారెంటీ పెన్షన్ స్కీమ్)ను అంగీకరించేది లేదని తెలియజేశారు.

## గర్భిణీలు, బాలింతలు నిత్యం పౌష్టికాహారం తీసుకోవాలి

**-రాకెట్ల అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార, పారిశుద్ధ్య కమిటీ సమావేశం**



అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పౌష్టికాహారం, పారిశుద్ధ్య కమిటీ సమావేశం దృశ్యం

**ఉరవకొండ, జూలై 21 ప్రభాతవార్త :** గర్భణీ మహిళలు, బాలింతలు నిత్యం పౌష్టికాహారం తీసుకోవాలి అప్పుడే తల్లీ బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని రాకెట్ల పీహెచ్‌సీ సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ షఫీ సూచించారు. మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రామీణ ఆరోగ్య పౌష్టికాహార, పారిశుద్ధ్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ



గ్రామంలో డ్రై డే ఫ్రైడే ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

డెంగ్యూ, మలేరియా జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బాల్య వివాహాలు, త్వరితగతిన గర్భాధారణ ఆడవారి ఆరోగ్యానికి హానికలుగజేస్తాయన్నారు. కొంత మంది గర్భిణీలు గర్భస్థ శిశు నిర్ధారణకు స్కానింగ్ చేయించి ఆడపిల్ల అని తెలుసుకొని భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారని ఇది చట్టరీత్యా నేరమని పీసీ పీఎన్‌డీటీ చట్టం గూర్చి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన తిలకించిన అనంతరం గ్రామంలో డ్రై డే ఫ్రైడే ర్యాలీను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, సచివాలయ ఏఎన్‌ఎం పద్మావతి, సీఓ భగవాన్‌దాస్, అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నపూర్ణ, చంద్రకాంతమ్మ, రామాంజినమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు రొద్దంలో మహాశక్తి ప్రచార రథం కార్యక్రమం

**రొద్దం,జూలై 21,ప్రభాతవార్త:**
రొద్దం మండలంలో శనివారం ఉదయం 10 గంటలకు మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, సత్యసాయి సిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బి.కే.పార్థసారథిల అదేశాల మేరకు మహిళా సాధికారత కోసం మహాశక్తి ప్రచార రథం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీపీ ఎం, నరహరి తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ మహిళా మణులు, తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులు మరియు మీడియా సోదరులు తప్పక పాల్గొని విజయవంతం చేయాలని ఎం.నరహరి ఎంపీపీ కోరారు.

## 25 నుంచి రాత్రి 9 వరకు రక్త నిధి సర్వీసులు



ప్రభుత్వ ఆసుపత్రి సూపరి ంటెండెంట్ వెంకటేశ్వరరావు

**అనంతపురం సిటీ, జులై 21 ప్రభాతవార్త**
అనంతపురం సర్వజన ఆసుపత్రిలో ఈ నెల 25 నుంచి రాత్రి 9 గంటల వరకు రక్తనిధి సర్వీసులను అందుబాటులో ఉంచుతున్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో విలేకర్లతో మాట్లాడు తూ.. ప్రస్తుతం సాయంత్రం 4 గంటల వరకు ప్రైవేట్ ఆసుపత్రిల్లో కూడా రక్తనిధిసేవలు అందుబాటులో ఉన్నాయ న్నారు. అయితే ప్రజల సౌకర్యార్థమై ఈ నెల 25 నుంచి రాత్రి 9 గంటల వరకు రక్త నిధి సేవలను అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## గిరిజన బిడ్డ కొండంత అండ సాధించింది

**- నీ స్ఫూర్తితో ఆడబిడ్డలు ముందుకు సాగాలి**

**- ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి**



సాకే భారతిని సన్మానిస్తున్న దృశ్యం

**శింగనమల, జులై 21 ప్రభాతవార్త**
పేదరిక అసమానతలు ఓడిం చావ్.. కొండంత ఘనత నీకే దక్కిందని నీ స్ఫూర్తితో ఆడ బిడ్డలు ముందుకు సాగాలని ఎస్సీ, ఎస్టీ, సంఘాల జేఏసీ రాష్ట్ర అద్యక్షులు సాకే హరి సాకే భారతి తో అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగలగుడ్డం గ్రామానికి చెందిన గిరిజన బిడ్డ సాకే భారతి పిహెచ్‌డి సాధించడాన్ని గర్విస్తూ ఆమెను ఘనంగా జేఏసీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని ఆడబిడ్డలు ముందుకు సాగాల ని, ఎస్సీ, ఎస్టీలలో వెనుకబాటు తనం కారణంగా అర్థాంతరంగా చదువులు ఆగిపోవడం జరుగుతోందని, ప్రభుత్వం వారికి సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాంగ్రెస్ వనమాల నాగరాజు, రామాంజినేయులు, ఇర్ఫాన్, ట్రాక్టర్ ఆది, రామకృష్ణ, మల్లయ్య, నారాయణ, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మీకు దండం స్వామి పాత రికార్డు ఆపండి

**- జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్**



పత్తి చంద్రశేఖర్

**అనంతపురం అర్బన్, జులై 21 ప్రభాతవార్త**
జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యా ణ్ వ్యవస్థలో నెల కొన్న లోపాలను ప్రశ్నిస్తే వాటికి సమాధానం చెప్ప లేక సీఎం జగన్ పడుతున్న పా ట్లు అన్ని ఇన్ని కావు. ఏ ప్రశ్న లేవనెత్తిన సీఎం జగన్ పవన్ కళ్యాణ్ మూడు పెళ్లిళ్ల మాత్రమే సమాధానంగా చెబుతున్నారు. ప్రజల సైతం మీకు దండం సామి ఈ పాత రికార్డు ఆపాండని అంటున్నారని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శిపత్తి చంద్రశేఖర్ అన్నారు. తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన బహిరంగ సభలో పవన్‌కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలను చంద్రశేఖర్ తీవ్రంగా ఖండించారు. ప్రజలు మీరు బహిరంగ సభలు లేదా సమావేశాలు పెట్టుకునేది మీరు చేసిన అభివృద్ధి చేయబోయే అభివృద్ధి చెప్పుకునేందుకు లేక తామే చేయలేకపోయాము ప్రతి పక్షాలు ప్రశ్నిస్తే వ్యక్తిగత ధూషణలకు దిగుతామని నిరూపించుకునేందుకా అన్న అను మానం ప్రజల్లో బలంగా నాటుకుపోయిందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి వ్యవస్థలోని లోపాలను ప్రశ్నస్తున్న పవన్‌కళ్యాణ్ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి, కానీ వ్యక్తిగత అంశాలను ప్రస్తావిస్తే ప్రజలు సీఎం విజ్ఞతకే వదిలేస్తారని పత్తి చంద్రశేఖర్ అన్నారు.

## ఏసిఏ సౌత్ జోన్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ వన్డే క్రికెట్ టోర్నమెంట్

**- ఏడిసిఏ సెక్రటరీ కె.మధు ఆచారి**



సెంచరీ సాధించిన రాజు కుళ్లాయప్ప

**అనంతపురం,క్లాక్‌టవర్ జూలై 21,ప్రభాతవార్త:**
అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో ఏసిఏ సౌత్ జోన్ సీనియర్ వడ్డే ఇంటర్ డిస్ట్రిరక్ట్ టోర్నమెంట్ 1వ రౌండ్ మ్యాచ్‌లు ఏవిఎస్‌లో జరిగాయి. బి గ్రౌండ్‌లో అనంతపురం వర్సస్ కడప జట్లు మద్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలచి అనంతపురం బ్యాటింగ్ ఎంచుకుంది. అనంతపుర ం 49 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 299 పరుగులు చేశారు. ఎం.రాజు కుళ్లాయప్ప క్లాసికల్ షాట్‌లతో సెంచరీ సాధించాడు 113 బంతుల్లో 110 నాటౌట్, పి.గిరినాథ్ రెడ్డి 51, జి.సంతోష్‌కుమార్ 45 పరుగులు చేశారు. కడప బౌలర్లు ఎం.విజయ భాస్కర్ రెడ్డి 4/68, కె.సుదర్శన్ 2/51 వికెట్లు తీశారు. కడప 37.2 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేశారు. అనంతపురం 122 పరుగుల తేడాతో విజయం సాధించింది. కర్నూలు వర్సస్ చిత్తూరు జట్ల మద్య మ్యాచ్‌లో టాస్ గెలచి చిత్తూరు బ్యాటింగ్ ఎంచుకుంది. చిత్తూరు 44.1 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 195 పరుగులు చేశారు. దినేష్ వర్మ 39, అభిషేక్ రెడ్డి 37 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లు ఎం.ఆంజనేయులు, షేక్ అబ్దుల్ హక్‌లు 3 వికెట్లు, ఎస్.కె.ఇస్మాయిల్ 2 వికెట్లు తీశారు. కర్నూలు 44.2 ఓవర్లలో 9 వికెట్ల నష్టపోయి 196 పరుగులు చేశారు. యు.ఎం.ఎస్.గిరినాథ్ 62, వి. సంజయ్ నాయుడు 73 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు సూర్య చరణ్ 4 వికెట్లు, దీపన్ సాహిత్ 2 వికెట్లు తీశారు. కర్నూలు జట్టు ఒక వికెట్ తేడాతో విజయం సాధించింది. మ్యాచ్‌లను ఏడిసిఏ ప్రసిడెంట్ పి.ఎల్.ప్రకాష్ రెడ్డి చూశారు. వై.శివ ప్రసాద్, మోహిన్ బాషా, హరీష్, ఎన్.ఎస్.వినీల్ కుమార్ మరియు రాజ్ కిరణ్‌లు పరిశీలకులుగా ఉన్నారు. శనివారం జరుగు మ్యాచ్‌లు ఏసీసీలో కర్నూలు వర్సస్ నెల్లూరు. బి గ్రౌండ్‌లో చిత్తూరు వర్సస్ కడప .

## రోడ్డుపక్కన అపస్మారక స్థితిలో పడివున్న వ్యక్తిని ఆసుపత్రికి చేర్చిన సిఐ

**కళ్యాణదుర్గం టౌన్, జులై 21ప్రభాతవార్త**
రోడ్డు పక్కన పస్మారక స్థితిలో పడి వున్న వ్యక్తిని అటుగా వెళ్తున్న సిఐ తేజోమూర్తి గమనించి అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా సిఐ తెలియజేస్తూ.. అతనికి ఏమైందన్న విషయంపై ఆరా తీస్తున్నామని, వివరాలు తెలియాల్సి ఉందన్నారు.



అపస్మారక స్థితిలో పడివున్న వ్యక్తి

06ATP27_06ATP27.qxd 21-07-2023 PM 10:41 Page 1



## 18 సంవత్సరాల వయసు నిండినవారు ఓటు హక్కుకై నమోదు చేసుకోండి

**-మహాత్మా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో తహశీల్దార్ బి.ఈరమ్మ**


కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దార్ బి.ఈరమ్మ

**ఉరవకొండ, జూలై 21 ప్రభాతవార్త** : 18 సంవత్సరాల వయసు నిండిన వారందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ బి.ఈరమ్మ సూచించారు. పట్టణంలోని మహాత్మా డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ యం.బసవ రాజు అధ్యక్షత వహించగా ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ జి.మునీంద్ర, సీనియర్ సహాయకులు యం.బి.సాయిక్రిష్ణ వంశీ హాజరయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బి.ఈరమ్మ మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో భాగంగా బీఎల్ఓలు మీవద్దకే వస్తున్నారని ఓటరుగా నమోదుకోసం వారికి దరఖాస్తులు అందించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ఓటు హక్కు కలిగివుండి దాన్ని సక్రమమైన పద్ధతిలో వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం తహశీల్దార్ పట్టణంలోని పోలింగ్ బూత్ నంబర్ 104 పరిధిలో జరుగుతున్న ఇంటింటి సర్వేను తనిఖీ చేసి ఓటర్లతో మాట్లాడి బీఎల్ఓకు పలు సూచనలు చేశారు.

## ఆలయానికి ఆదాయం పెరగాలన్న ఉద్దేశంతోనే నిబంధనల మేరకే గడువిచ్చాం..!

**-తలనీలాలు, టెంకాయలు వేలం హెచ్చుపాటదారు రూ.27.02 లక్షలు చెల్లించారు -స్పష్టం చేసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్**


విలేఖరులతో మాట్లాడుతున్న ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్

**ఉరవకొండ, జూలై 21 ప్రభాతవార్త** : ఆలయానికి ఆదాయం పెరగాలన్న ఉద్దేశంతోనే నిబంధనలకు లోబడి హెచ్చుపాటదారులకు డబ్బు చెలించడానికి కొంత గడువు ఇవ్వడం జరిగిందని మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మీనరసింహస్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు. 18వ తేదీన జరిగిన వేలాల్లో తలనీలాలు ప్రోగు చేసుకొను హక్కు వేలంను 52,05,000 రూపాయలకు, టెంకాయలు అమ్ముకొను హక్కు వేలంను 23,30,000 రూపాయలకు సి.పుల్లయ్య, సప్లయర్స్ సామానులు బాడుగకు ఇచ్చుకొను హక్కు వేలంను ఆంజనేయులు 5,40,000 రూపాయలకు దక్కించుకున్నారన్నారు. టెంకాయలు విక్రయించుకొను హక్కు, తలనీలాలు సేకరణ హక్కు రెండు వేలాలను సి.పుల్లయ్య దక్కించుకోవడంతో ఆయన మోదటిరోజు 8,97,000 రూపాయలు, రెండవ రోజు 17,05,500 రూపాయలు దేవస్థానం ఖాతాకు నేరుగా జమ చేశారన్నారు. టెంకాయలు అమ్ముకొను హక్కుకు సంబంధించి చెల్లించవలసిన మొత్తం చెల్లించడానికి 3 రోజులు సమయం అడగడంతో ఇచ్చామన్నారు. గతంలో టెంకాయలు అమ్ముకొను హక్కును సి.పుల్లయ్యే దక్కించుకొని ఆ హక్కుకు సంబంధించిన మొత్తం డబ్బును దేవాలయానికి సకాలంలో పూర్తిగా చెల్లించాడన్నారు. ఆలయానికి వచ్చిన మొత్తం గతం కంటే ఎక్కువగా ఉండటంతో కొన్ని రోజులు గడువు ఇవ్వడం జరిగిందన్నారు. తిరిగి వేలం పెడితే అంత మొత్తం రాకపోతే దేవాలయానికి నష్టం జరుగుతుందన్న ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని హిందూ దేవాదాయ చట్టం సెక్షన్ 80, 82(1) (2), (3), రూలు 15 ప్రకారం హెచ్చుపాటదారునికి తగినంత ఆస్థులు కలిగినందున (సాలివెన్సీ) తీసుకొని తాత్కాలిక గడువు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒకవేళ హెచ్చుపాటదారుడు కోరిన సమయంలోపు అతను పాడుకున్న మొత్తంలో సగభాగం చెల్లించని పక్షంలో ఆ వ్యక్తి యొక్క ఆస్థుల నుండి వసూళు చేసుకొను హక్కు దేవాదాయ శాఖకు ఉంటుందన్నారు. ఈ విషయమై దేవాదాయ శాఖ ప్రాంతీయ కమీషనర్‌కు సమగ్ర నివేదిక పంపుతామని ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకొంటామని తెలిపారు. అంతేగాని వేలాల్లో ఎలాంటి తప్పులు జరుగలేదని ఈఓ కె.విజయ్‌కుమార్ స్పష్టం చేశారు.

## మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కట్టా వరలక్ష్మి బాధ్యతల స్వీకరణ

**-ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందిస్తానని వెల్లడి**


బాధ్యతలు చేపట్టిన కట్టా వరలక్ష్మి

**ఉరవకొండ, జూలై 21 ప్రభాతవార్త** : ఉరవకొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కట్టా వరలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండల ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆమెను ఇక్కడికి బదిలీ చేయడంతో శుక్రవారం ఉదయం కార్యాలయం చేరుకొని బాధ్యతలు చేపట్టగా సిబ్బంది మర్యాదపూర్వంగా కలిసి సన్మానించారు. ఇప్పటి వరకు ఈఓఆర్‌డీ పి.చంద్రమౌళి ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎంపీడీఓ కట్టా వరలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ అందరి సహకారంతో మెరుగైన సేవలు అందిస్తానని చెప్పారు.

## వేలాల్లో నిబంధనలు అమలు చేయని ఈఓను సస్పెండ్ చేయాలి

**- తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నాలో వేలం పాటదారులు**


ఆర్ఐ రామకృష్ణకు వనతిపత్రం అందిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, జూలై 21 ప్రభాతవార్త** : వేలాల్లో నిబంధనలు అమలు చేయని పెన్నహోబిళం లక్ష్మీనరసింహస్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18వ తేదీన ఆలయంలో జరిగిన వేలాల్లో పాల్గొన్న పాటదారులు శుక్రవారం పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాటదారులు యం.సి.మారెన్న, యం.రామాంజినేయులు, దివాకర్, సి.శ్రీనివాసులు, బి.మహేష్, వి.మణికంఠ, సి.నాని, మీనుగ రమేష్ తదితరులు మాట్లాడుతూ వేలం నిబంధనల్లో వేలం ముగిసిన వెంటనే హెచ్చుపాటదారు పాట మొత్తంలో సగం చెల్లించి రసీదు పొందాల్సి ఉంటుందని లేనిపక్షం వేలంపాట రద్దు చేస్తామని ఉందని అయితే తలనీలాలు, కొబ్బరికాయల వేలం దక్కించుకున్న అనంతపురానికి పుల్లయ్య నిబంధనల మేరకు డబ్బు చెల్లించలేదన్నారు. సమయం ముగిసిన తరువాత సాయంత్రం 5 గంటలకు వచ్చి బ్యాంకు చెక్కులు తెచ్చానని చెప్పి చెక్కును ఈఓకు ఇచ్చారని ఆ చెక్కుకు సబంధించి బ్యాంకులో డబ్బులు ఉన్నాయో లేదో చెక్ చేయగా అకౌంట్‌లో కేవలం 30వేల రూపాయలు మాత్రమే ఉన్నాయని తేలిందన్నారు. దీంతో మీకు టెండరు ఇచ్చేది లేదని రద్దు చేస్తామని చెప్పిన ఈఓ ఆపై హెచ్చుపాటదారులతో కుమ్మక్కై టెండరు డబ్బు జమ చేశారని చెప్పుకొచ్చారన్నారు. ఆలయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ భక్తులను తప్పుదోవ పెట్టిస్తున్న ఈఓపై ఉన్నతాధికారులు విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఆర్ఐ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివ, పెద్దన్న, ఎల్లప్ప, వీరేష్, రంగనాధ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## విఆర్‌ఏల సమస్యలు తక్షణం పరిష్కరించాలి

**- తహశీల్దార్ కార్యాలయం ముందు అర్ధనగ్న ప్రదర్శన**


తహశీల్దారు కార్యాలయం ముందు వీఆర్‌ఏల అర్ధనగ్న ప్రదర్శన

**పెనుకొండ, జూలై 21 ప్రభాతవార్త** : విఆర్‌ఏల సమస్యలను తక్షణం పరిష్కరించాలంటూ తహశీల్దారు కార్యాలయం ముందు శుక్రవారం విఆర్‌ఏలు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, డిఏ రికవరీ ఉత్తర్వులు ఉపసంహ రించాలన్నారు. నామినీలుగా పని చేస్తు్న వారందరినీ వీఆర్‌ఏలుగా నియ మించి ఆ కుటుంబంలో న్యాయం చేయాలని కోరారు. వీఆర్‌ఓ, వాచ్‌మెన్, అటెండర్, డ్రైవర్, ఇతర పోస్టులను విఆర్‌ఏలను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు విఆర్‌ఏలకు వర్తింపచేయాలని, చనిపోయిన విఆర్‌ఏ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, విఆర్‌ఏల సంఘం నాయకులు ఆంజినేయులు, నరసప్ప, పుల్లన్న, గోవిందప్ప, సుబ్బరాయుడు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక కోసం కలెక్టర్ వాహనాన్ని అడ్డుకున్న సిపిఐ ఇన్‌చార్జ్ పవిత్ర, మహిళలు


కలెక్టర్ వాహనాన్ని అడ్డుకున్న సిపిఐ తాలూకా ఇన్‌చార్జ్ పవిత్ర, మహిళలు

**మడకశిర టౌన్, జూలై 21 ప్రభాత వార్త** : స్మశాన వాటిక స్థలం కేటాయించాలని సత్యసాయి జిల్లా కలెక్టర్ వాహనన్ని దళిత మహిళలు అడ్డుకున్నారు. శుక్రవారం మడకశిర పట్టణంలో టిటిడి కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి విచ్చేశారు. సమావేశం తర్వాత గుడిబండ మండలం రాళ్లపల్లి గ్రామానికి చెందిన దళిత మహిళలు దాదాపు 250 మందితో స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడానికి వేచి ఉండగా కలెక్టర్ వారితో మాట్లాడకుండా వెళ్లిపోతుండడంతో వారు కలెక్టర్ వాహనన్ని అడ్డగించారు. ఈ సందర్భంగా తాలూకా సిపిఐ ఇన్‌చార్జ్ పవిత్ర, మహిళలు మాట్లాడుతూ.. భూ స్వాములకు అండగా గతంలో ఇచ్చిన స్మశాన వాటికను అధజకారులు రాజకీయ నాయకులు కలిసి మాకు మోసం చేసినారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిబండ మండల రాళ్లపల్లి గ్రామంలో దళిత మహిళలు మాకు స్మశాన వాటిక ఇవ్వాలి అంటూ వాదనకు దిగారు ఎన్ని సార్లు కలెక్టర్లకు మొరపెట్టుకున్న ఉపయోగం లేదన్నారు. ఈ స్థలం కోర్టులో ఉన్నది దానిని పరిష్కరించి మీకు ఇప్పిస్తానని కలెక్టర్ చెప్పిన వినకుండా భూ స్వాములకు గవర్నమెంట్ భూమి ఎలా రిజిస్టర్ అవుతుంది. అధికారులు తలుచుకుంటే మాకు ఇప్పించగలరు దీనిని రాజకీయంతో ముడిపెట్టి దళితులకు ఇవ్వకుండా పెత్తందారులకు కొమ్ముకాస్తున్నారు. అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

## గ్రామాల్లో 104 సిబ్బందికి సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కార్యక్రమం


సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కల్పిస్తున్న 104 సిబ్బంది

**చెన్నేకొత్తపల్లి, జూలై 21 ప్రభాతవార్త** : గ్రామాల్లో 104 సర్వీస్ సిబ్బంది డా.ఉదయ్ ఆధ్వర్యంలో గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ పిజిషన్ ప్రోగ్రామ్, శుక్రవారం, చెన్నేకొత్త పల్లి మండలంలోని ఎర్రనిపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి ఏఎస్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, హెల్త్ అసిస్టెంట్ హాజరయ్యారు. ఈసందర్భంగా, ప్రజలకు బిపి, షుగర్ వ్యాధి గ్రస్తులకు రక్త పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్, ఆశలత, వెంకటనారాయణలు మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంచి నీటిలో దోమలు గుడ్లు పెడుతుంది. లార్వాలు తయారు అవుతాయి. కనుక ప్రతి ఒక్కరూ నీటి నిల్వ ఉన్న వాటిని ఎప్పటికప్పుడు శుభ్ర పరిచి చేసినట్లు అయితే మలేరియా డెంగ్యూ జ్వరాలు భారిన పడకుండా ఉండవచ్చు అని ఈ సందర్భంగా తెలియజేశారు.

## ఆత్మీయ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత నోట్ పుస్తకాలు పంపిణీ


పుస్తకాలను అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

**రామగిరి, జూలై 21 ప్రభాతవార్త** : శుక్రవారం రామగిరి మండలం గంతి మర్రిస్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో గంతి మర్రి, కలికివాండ్లపల్లి, పెనుబోలు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న 102 మంది బాల, బాలికలకు ఆత్మీయ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత నోట్ పుస్తకాలు, ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్లు అందజేశారు. ఆత్మీయ ట్రస్టు చైర్మన్ జయచంద్రారెడ్డి అధ్యక్షత జరిగిన కార్యక్రమమునకు, ముఖ్య అతిథులుగా ఎంఈఓ 1 మున్వర్‌బాషా, ఎంఈఓ2 శ్రీనివాసులు, కుంటిమద్ది హైస్కూల్ హెచ్ఎం అనంత పద్మనాభం హాజరై విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. విద్యా రంగంలో ఆత్మీయ ట్రస్టు చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఆత్మీయ ట్రస్టు చేయూత ఇవ్వడం అభినందనీయమని హర్షనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సర్పంచు, ఎంపిటిసి, పాఠశాల కమిటీ చైర్మన్, స్తానిక ఉపాధ్యాయ బృందం శివయ్య, విజయ్, ఉమామహేశ్వర్, సకల చంద్ర శేఖర్, కలికివాండ్లపల్లి ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, పెనుబోలు ప్రధానోపాధ్యాయులు ఆదిశేషు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడి కేంద్రాల్లో కిట్ల పంపిణీ


చిన్నారులకు కిట్లు అందచేస్తున్న దృశ్యం

**గుత్తి, జూలై 21 ప్రభాతవార్త** : పట్టణంలోని పలు అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారుల సౌకర్యార్థం ప్రభుత్వం కేటాయించిన కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెర్లోపల్లికాలనీ, బిసి కాలనీల్లోని అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారులకు మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల విద్యా పరంగా చేయూతనందించేందుకు వీటిని పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీరాణి, కార్యకర్తలు నాగమ్మ, జ్యోతి, ఎఎన్ఎం రాజేశ్వరి, అనురాధ, వరాలమ్మ, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి


సర్టిఫికెట్లను అందచేస్తున్న దృశ్యం

**గుత్తి, జూలై 21 ప్రభాతవార్త** : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్‌చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వైస్‌చైర్‌పర్సను వరలక్ష్మి, పద్మలతారెడ్డిలు పేర్కొన్నారు. గుత్తి పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలో 15,16 వార్డుల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి కులధృవీకరణ, ఆదాయ ధృవీకరణపత్రాలను అందచేశారు. దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సర్వే చేయించి సర్టిఫికెట్లు అందచేయడం జరుగుతుందని వారు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం పట్టణంలో మెప్మా బజార్‌లను 32 ఏర్పాటు చేయగా వాటిని లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు మాతంగి, అంజల, నరేష్, నజీర్, రమణ, మెప్మా చెరణ్, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ వైద్యులు రియాజుద్దిన్ మృతి


మృతి చెందిన డాక్టర్ రియాజుద్దిన్ (ఫైల్‌ఫోటో)

**గుత్తి, జూలై 21 ప్రభాతవార్త** : పట్టణానికి చెందిన సీనియర్ వైద్యులు డాక్టర్ రియాజుద్దిన్ (79) శుక్రవారం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఆయన నాలుగు దశాబ్దాలకుపైగా నామమాత్రపు రుసుముతో పేదలకు వైద్యం అందిస్తూ అందరి డాక్టరని అనిపించుకున్నారు. 1978లో గుత్తి నుండి గుత్తి ఆర్ఎస్, చెర్నేపల్లి పంచాయతీగా విభజించినప్పుడు తొలి సర్పంచుగా ఆయన సేవలు అందించారు. ఆయన మృతి పట్ల గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మున్సిపల్‌చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైకాపా మండల, పట్టణ కన్వీనర్లు శ్రీనివాసులు, హుసేన్‌పీరాలతో పాటు పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు, విలేకరులు, తదితరులు తమ సంతాపం వ్యక్తం చేశారు.

## గేట్స్‌లో ఉచిత నేత్రవైద్యశిబిరం


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**గుత్తి, జూలై 21 ప్రభాతవార్త** : గుత్తి పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాల డైరెక్టర్ శ్రీవాణి జన్మదినం పురస్కరించుకుని కడప జిల్లా పుష్పగిరికి చెందిన ప్రముఖ కంటి వైద్యశాల వైద్యులు హాజరైన 300 మందికిపైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల వ్యవధిలోనే శిబిరానికి ఇంత స్పందన రావడం అనూహ్యమన్నారు. శస్త్రచికిత్సలకు ఎంపికైన వంద మందికి తమ సొంత ఖర్చుతో వారికి చికిత్స చేయిస్తామని ఆయన పేర్కొన్నారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూరయ, ఎన్ఎస్ఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా రవాణచేస్తున్న బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న లారీ

**అమరాపురం, జూలై 21, ప్రభాతవార్త** : మండల పరిధిలో వి.అగ్రహారం గ్రామం వద్ద అక్రమంగా బియ్యం తరలిస్తున్న లారీను రెవెన్యూ అధికారులు మరియు ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎఎస్ఐ రామాంజనేయులు తమ సిబ్బందితో కాపు కాచి లారీని సీజ్ చేశారు. జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు రాబడిన సమాచారం మేరకు బియ్యం లారీని పట్టుకున్నారు. కర్ణాట రాష్ట్రం పావగడ నుండి టుంకూర్‌కు అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం, దీనిపై పోలీసులు పూర్తి విచారణ చేసి వివరాలను అందిచాలని విజ్ఞప్తి.

## 2వ రోజు కోనసాగిన విఆర్‌ఏల దీక్షలు


దీక్ష చేస్తున్న విఆర్‌ఏలు

**అమరావురం, జూలై 21, ప్రభాతవార్త:** మండల కేద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో విఆర్‌ఏలు తమ న్యాయమైన డిమాండ్లను పరష్కరించాలని కోరుతూ 2వ రోజు శుక్రవారం కూడా దీక్షను కోనసాగించారు. ఏపీ గ్రామ రెవెన్యూ సహాయక సంఘం ఆదేశాల మేరకు అమరాపురం మండలంలో విధులు నిర్వహిస్తున్న విఆర్‌ఏలు ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ దీక్ష నిక్వహించారు. మండల విఆర్‌ఏల అధ్యక్షులు ఈరన్న, ఉపాధ్యక్షుడు దార మాధప్పలు మాట్లాడుతూ విఆర్‌ఏలకు కనీస వేతనం 25 వేలు ఇవ్వాలని డిఏ రికవరీఉత్తర్వులను రద్దుచేసి డిఏతోకూడిన వేతనంఇవ్వాలని నామానిలుగా పనిచేస్తున్న వారికి న్యాయం చేయాలని ప్రమోషన్‌తో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలనువర్తించాలని 65సంవత్సరాలుదాటి చనిపోయిన విఆర్‌ఏలకుటంబాలకు ఉద్యోగఆవకాశం కల్పించాలని వారుడిమాండ్ చేశారు. ఇందులో విఆర్‌ఏలు కరియప్ప, చంద్రప్ప, రామచంద్ర, హనుమంతరాయ, రమేష్, రాజు, రంగమ్మ, అనుసూయమ్మ, నేత్రవతిలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష కార్యక్రమం యెక్క లక్ష్యం


సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

**ధర్మవరం, జూలై 21, ప్రభాతవార్త:** ప్రజల సమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష కార్యక్రమంయెక్క ముఖ్యలక్ష్యం అని సర్పంచ్ నందిని, ఉపసర్పంచ్ మంజునాథరెడ్డి, ఎంపిటిసి చెన్నకృష్టమ్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని గొట్లూరు-2 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏంపిడిఓ సౌజన్య కుమారి, డిప్యూటి తహశీల్దార్ ఈశ్వరయ్యలు జగనన్న సురక్ష కార్యక్రమం యెక్క ప్రాధాన్యతను, వాటివల్ల ఉపయోగాలను ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుండి వాలంటీర్లు, సచి వాలయ సిబ్బంది ప్రజా ప్రతి నిధులు అందరూ కలసి ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న 11 రకాల సర్వీసులను గూర్చి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో 3195 సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మురళితో పాటు సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బీసీ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీలు

**- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి**

**- ధర్మవరం బీసీ వెల్ఫేర్ అధికారి రాజ కుళ్లాయప్ప**


వసతి గృహంను పరిశీలిస్తున్న దృశ్యం

**ధర్మవరం, జూలై 21, ప్రభాతవార్త:** పట్టణంలోని గుట్ట కిందపల్లి బీసీ వసతి గృహంను ధర్మవరం బీసీ వెల్ఫేర్ అధికారి రాజ కుళ్లాయప్ప శుక్రవారం ఉదయం అకస్మి ంగా సందర్శించారు. ఈ సందర్భంగా రాజకుళ్లాయప్ప హాస్టల్‌లో ఆకస్మిక తనఖీ నిర్వహించి వసతి గృహంలో పిల్లలకు ఇస్తున్న భోజనాలపై ఆరా తీశారు. వసతి గృహం నందు విద్యార్థులు ఎంత మంది ఉన్నారు, రికార్డులు ఎలా ఎన్నాయి అని పరిశీలించి తనిఖీలు చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాలలో నాణ్యత ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి తన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మోనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అదేవిధంగా నాణ్యతతో కూడిన భోజనం విద్యార్థులకు అందించాలన్నారు.

## రైతులు ఆర్థిక స్వాలంభన సాధించాలి

**- కెనరాబ్యాంక్ మేనేజర్ మణికుమార్‌రెడ్డి**


రైతులతో మాట్లాడుతున్న మణికుమార్‌రెడ్డి

**గుడిబండ, జూలై 21 ప్రభాతవార్త** : మండల పరిధిలోని మందలపల్లి కెనరాబ్యాంకు పరిధిలోని రైతులకు విరివిగా రుణాలు అందిస్తున్నామని ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థిక స్వావలంభన సాధించాలని మందల పల్లి కెనరా బ్యాంకు మేనేజర్ మణికుమార్‌రెడ్డిరైతు లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందలపల్లి కెనరా బ్యాంక్ పరిధిలోని పాడి పశువులు, గొర్రెలు, కోళ్ల ఫారాలు లాంటి స్వయం ఉపాధి రైతులకు విరివిగా రుణాలు అందిస్తున్నామని అలాగే రైతులు గ్రూపులుగా ఏర్పడితే వారికి కూడా గ్రూపు రుణాలు మంజూరు చేస్తామని కావున రైతులు ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వాలంభన దిశగా అడుగులు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోసీనియర్ పాత్రికేయులు షబ్బీర్, నంజుండయ్య, దాసప్ప తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా ఎంఎల్ఏ అభ్యర్థిగా ముందు వరుసలో మంజునాథ్


జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్

**గుడిబండ, జులై 21 ప్రభాతవార్త** : మడకశిర తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరికి అవకాశం దక్కుతుందనే ఆతృత నియోజకవర్గంలోని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలను ఊరిస్తోంది. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఈ ఆతృత మరింత ఎక్కువగా ఉంది. మడకశిర నియోజకవర్గంలో ఇటీవల కాలంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీలో మాజీ ఎమ్మెల్యే ఈరన్నకు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి జరిగిన వర్గపోరులో దాదాపు గుండుమల తిప్పేస్వామి పై చేయి సాధజంచారంటూ నియోజకవర్గప్రజలు చర్చించుకుంటున్నారు. దానికి బలం చేకూరు స్తూ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కమిటీలన్ని గుండుమల తిప్పే స్వామి ఆధ్వర్యంలో ఏర్పడుట, ఐదు మండలాల కన్వీనర్లు పదవులు గుండు మల వర్గీయులకే దక్కడం గమనార్హం. ఈ క్రమంలో మడకశిర తేదేపా అభ్యర్థిగా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిసిగిరి మంజునాథ్ పేరు ప్రముఖం గా వినిపిస్తోంది. ఈయనకు గుండుమల తిప్పేస్వామి, శ్రీనివాసమూర్తిల ఆశీస్సులు కూడా ఉండడం నిత్యం ప్రజల్లో ఉండి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం, స్థానిక ఎమ్మెల్యే అవినీతిని ఎండగట్టడం, తేదేపా అది ష్టానం కూడా యువతకు ప్రాధాన్తయ కల్పిస్తామని ప్రకటించడం కలిసొచ్చే అంశం. నియోజకవర్గ ప్రజలకు కూడా కొత్త తరాన్ని కోరుకుంటున్న తరుణంలో మంజునాథ్ ఎంత వరకు నెగ్గుకు వస్తారో చూడాలి.

## ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

**- రైతు సంఘం నాయకులు**


రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రైతు సంఘం నాయకులు

**కనగానపల్లి, జులై 21 ప్రభాత వార్త** : చంద్రాచర్ల గ్రామానికి చెందిన రైతు సూర్య నారాయణ గురువారం ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన విషయం తెలిసిందే., కాగా రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బెలం మహాదేవ్ శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బెల్లం మహాదేవ్ మాట్లాడుతూ.. బోర్లు వేసి పంటలుపెట్టి ఆర్థికంగానష్టపోయి ఆత్మహత్యచేసుకున్న రైతు సూర్య నారాయణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మృతుని కుటుంబానికి 15లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, అలాగే బ్యాంకులో తీసుకున్న రుణాలు మొత్తం మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బాలరాజు, రామగిరి మండల రైతు సంఘం కార్యదర్శి ముత్యాలప్ప, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మంచి మార్కులు సాధించాలి.. కళాశాలకు పేరు తేవాలి

**- కార్యదర్శులు శ్రీనివాస్, గోవిందప్ప**


పూజలో పాల్గొన్న కార్యదర్శులు శ్రీనివాస్, గోవిందప్ప

**అగళి, జులై 21 ప్రభాతవార్త** : విద్యార్థులు మంచి మార్కులు సాధించి కళాశాలకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని కళాశాల కార్యదర్శిలు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోవిందప్ప అన్నారు. అగళి కెజిఎ గుప్తా కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు పరీక్షకు పోయే సమయంలో సరస్వతి పూజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌తోపాటు గోవిందప్ప మాట్లాడుతూ.. దివంగత కెజిఎ గుప్తా ఎంతో కష్టపడి పేద విద్యార్థుల సౌకర్యార్థం కళాశాలను ఏర్పాటు చేశారని, ఇక్కడ చదివే విద్యార్థులు కష్టపడి చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు, ఊరికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సరస్వతి పూజా కార్యక్రమం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. పురోహితులు సుబ్రహ్మణ్య శాస్త్రి, పంచామృతాభిషేకం, మహా మంగళహారతితోపాటు సరస్వతిదేవిపై మంచి ప్రార్థనలు చేసి విద్యార్థులను ఆశీర్వదించారు. సరస్వతి కరుణాకటాక్షం విద్యార్థులపై ఉండాలని, పరీక్షల్లోమంచి మార్కులు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘురామ్, కార్యదర్శి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోవిందప్ప, కరస్పాండెంట్ హనుమంతరాయప్ప, ట్రస్టీలు కల్లప్ప, శివప్ప, రంగనాథప్ప, శేషాచలం, కృష్ణప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

05ATP21_05ATP21.qxd 21-07-2023 PM 11:39 Page 1



# జర్నలిస్టులను ఆదుకున్న ఘనత టిడిపిదే

## - 5వ రోజు దీక్షకు సంఘీబావం తెలపిన మాజీ మంత్రి పల్లె

ఓబుళదేవరచెరువు, జూలై 21, ప్రభాతవార్త : ప్రజా సంక్షేమం కోసం నిత్యం పరితపించే జర్నలిస్టులను అన్ని విధాలా ఆదుకున్న ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఇంటి పట్టాల కోసం రిలే నిరాహారదీక్షలు శుక్రవారం 5వ రోజూ కొనసాగింది. ఈ దీక్షలకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియచేసింది. ఈ సందర్భంగా పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను వెలికితీసి ప్రజా శ్రేయస్సుకు పాటుపడుతున్న పాత్రికేయులు ఇంటి పట్టాల కోసం రోడ్డెక్కడం చాలా బాధాకరం అన్నారు. జగనన్న ఇల్లు కాదు కాలనీలు నిర్మిస్తా మని ఎంతో భీరాలు పలుకుతున్న వైసిపి ప్రభుత్వానికి ఎనిమిది మంది జర్నలిస్టులకు ఇంటి పట్టాలు ఇవ్వడం చేతకాలేదానని ప్రశ్నించారు. అర్హత లేని వైసిపి నాయకులకు ఇంటి పట్టాలు ఇవ్వగా లేనింది అర్హులైన జర్నలిస్టులకు పట్టాలు ఇవ్వకుండా అన్యాయం చేస్తారానన్నారు. అంతో ఇంతో విషయ పరిజ్ఞానం, అధికారులతో పరిచయం ఉన్న విలేకరుల పరిస్థితులు ఇలా ఉన్నాయంటే సామన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్క సారి ఆలోచించాలని ప్రజలను కోరారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 17 మంది జర్నలిస్టులకు ఇంటి పట్టాలు, 12 మంది భూమి పట్టాలు ఇచ్చానన్నారు. ఇప్పటికైనా తహశీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ గారు స్పందించి అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి 5 శెంట్లు ఇంటి నివేశస్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యల పై నిర్లక్ష్యం చేస్తే టిడిపి పార్టీ తరుపున ఆందోళనా కార్యక్రమాలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. పల్లె వెంట



జర్నలిస్టుల దీక్షకు పల్లె సంఘీబావం

కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పిటిసి పిట్టా ఓబుళరెడ్డి, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, జిల్లా అధికార ప్రతినిధి వల్లెపు సోమశేఖర్, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి జెరిపిటి అంజినప్ప, నియోజకవర్గ టిఎన్‌టియుసి అధ్యక్షుడు నిజాం, ఎస్సీ సెల్ బడిశం రామాంజినేయులు, గంగాద్రి, శ్రీనివాసులు, అంజినప్ప, నాయకులు జాకీర్, మాజీ సర్పంచ్ షఫీ, మస్తానమ్మ, షబ్బీర్, చాంద్‌బాష, చంద్రశేఖర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, ఆంజన్‌రెడ్డి, చలపతి, కుమార్ రాయల్, కురుమాల చిన్నపరెడ్డి, అబు, నారాయణతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే జగనన్న సురక్ష పాలన కార్యక్రమం



లబ్దిదారులకు దృవపత్రాలు పంపిణీచేస్తున్న చిన్నపరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ భర్త చిన్నపరెడ్డి

తనకల్లు, జూలై 21, ప్రభాతవార్త:

మండల పరిధిలోని టి.సదుము సచివాలయం నందు జగనన్న సురక్ష కార్యక్రమం తహసిల్దార్ పిజి శోభసువర్ణమ్మ, డిప్యూటీ తహసిల్దార్ మధునాయక్, ప్రత్యేక అధికారి, ఎంపిడిఓ పూల నరసింహులు, ఈఓఆర్‌డి ఆనందయ్య, సర్పంచ్ ఆధ్వర్యంలో సుజాతమ్మ భర్త చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గడప వద్దకే సురక్ష పాలన అందిస్తున్నఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన వారికి కాకుండా ఉన్నవారిని గుర్తించి వారికి పథకాలు అందేలా చూడాలని వాలంటీర్‌లకు, సచివాలయ సిబ్బందిని కోరారు. ఏ ఒక్కరూ కూడా జగనన్న పథకాలు రాలేదని బాధపడకూడదని, ప్రజల వద్దకు అవసరమైన అన్ని 12 సర్టిఫికెట్స్ ఈ నెలలో సచివాలయం ద్వారా ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓ సోము, చిన్నపరెడ్డి,ఎంపిటిసి వీమాకర్‌రెడ్డి, ఏ.రమణారెడ్డి, రెడ్డిపీరా, ఆనంద్‌రెడ్డి,సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వాలంటీర్‌లు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ జాతరకు యంజి రెడ్డి విరాళం



కాలనీవాసులకు విరాళం అందిస్తున్న ఆలయ సిబ్బంది

తనకల్లు, జూలై 21, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కనసానివారిపల్లి వద్ద వెలసిన గంగమ్మ జాతరకు ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఆలయ అధ్యక్షుడు యంజి రెడ్డి రూ. 30వేల రూపాయలు గొల్లవారిపల్లి కాలనీవాసులకు విరాళం అందజేశారు. ఆ మొత్తాన్ని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ వినోద్‌కుమార్, వైసిపి యువ నాయకులు సమరసింహారెడ్డి,శ్రీనాథ్ వీరి చేతులు మీదుగా అందించారు. ఈ సందర్భంగా గ్రామప్రజలు మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలకు మంచి మనస్సుతో ఆర్థిక సహాయం చేసిన ఎంజి రెడ్డికి కుటుంబ సభ్యులకు గంగమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆ గంగమ్మ తల్లిని కోరారు.

## మున్సిపల్‌కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రిలే నిరాహార దీక్ష చేపడుతున్న మున్సిపల్ కార్మికులు

కదిరి, జులై 21 ప్రభాతవార్త

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం పట్టణంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, జనార్ధన, బాలకృష్ణ, రాజు, నరసింహమూర్తి, సూరి, సిఐటియు నాయకులు జిఎల్.నరసింహులు, జగన్‌మోహన్, ముస్తక్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

కదిరి, జులై 21 ప్రభాతవార్త

రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు బడా సుబ్బిరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతులకు సంబంధించిన అన్ని రకాల అప్పులను మాఫీచేయాలన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టబద్ధత చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పెద్దన్న, హనుమంతరెడ్డి, రమణ, మధు, తదితరులు పాల్గొన్నారు .

## దానిమ్మలో తెగుళ్లు నివారించాలి

### - ఉద్యాన అధికారి లావణ్య



దానిమ్మ పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి లావణ్య

కదిరి, జులై 21 ప్రభాతవార్త

దానిమ్మ పంటకు తెగుళ్లు సోకకుండా చర్యలు చేపట్టాలని పుట్టపర్తి ఉద్యాన అధికారి లావణ్య తెలిపారు. శుక్రవారం అమడగూరు మండల పరిధిలోని మహ్మద్‌బాద్ సమీపంలోని దానిమ్మతోటను ఆమె పరిశీలించి తోటలకు సోకిన తెగుళ్లను ఆదిలోనే తుంచి వేయాలని రైతుకు సూచించారు. తెగులు సోకిన కాయలను ముందుగా తొలగించి తోటకు దూరంగా వేయాలన్నారు. అనంతరం వివిధ రకాల అంశాలపై అవగాహన కల్పించారు. వాతావరణ మార్పులతో తెగుళ్లు సోకే ప్రమాదం ఉంటుందని వాటిపట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పంట పట్ల ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కేతిరెడ్డి చొరవతో బోరు వేయించిన జబ్బార్‌బాష



బోరు వద్ద పూజలు నిర్వహించిన దృశ్యం

తాడిపత్రిఅర్బన్, జూలై 21 ప్రభాతవార్త

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో పట్టణంలోని వడ్లపాలెంలో శుక్రవారం వైసిపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి జబ్బార్‌బాష బోరు వేయించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇచ్చిన మాట మేరకు వడ్లపాలెంలో రెండు చోట్ల బోర్లు వేయించాలని ఆదేశించడంతో ఒక చోట బోరు పనులు పూర్తికాగా ప్రస్తుతం రెండవ బోరుకు స్థలాన్ని కేటాయించి అందులో వైసిపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి జబ్బార్‌బాష పూజలు నిర్వహించి బోరు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఖాదర్‌బాష, షఫి, కార్యకర్తలు, వాలంటీర్లు శాంతి, కృష్ణకుమారి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# జగనన్న సురక్ష కార్యక్రమం



లబ్దిదారులకు దృవీకరణపత్రాలను అందచేస్తున్న సర్పంచు తలారి అరుణ



మాట్లాడుతున్న మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు

యాడికి, జూలై 21 ప్రభాతవార్త

యాడికి, రాయలచెరువు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపిడిఒ, తహశీల్దార్‌ల అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి వైసిపి మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, వైకాపా నాయకుడు తలారి నాగేష్‌లు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా దాదాపు 11 రకాల దృవీకరణపత్రాలను ఎటువంటి రుసుము చెల్లించకుండా పొందవచ్చన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు, సౌకర్యంతో పాటు సౌలభ్యం చేకూరుతుందని, నవరత్నాల వంటి పథకాలు, మేనిఫెస్టోలో లేని పథకాలను 99 శాతం అమలు పరిచారని మిగిలిన ఒక శాతం కూడా చేసి ప్రజలకు వంద శాతం పథకాలు అందేలా లబ్దిదారుల లబ్ది చేకూరేలా చేస్తామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా లబ్దిదారులకు దృవీకరణపత్రాలను మండల నాయకులు, అధికారుల చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మినారాయణ, డిప్యూటి తహశీల్దార్ బాలమ్మ, ఇఒ ఎర్రిస్వామి, సర్పంచు పండు అనురాధ, తలారి అరుణ, వైస్‌ఎంపిపి హాసీనాబేగం, ఉపసర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపిటిసిలు బొంబాయి బ్రదర్ వెంకటనాయుడు, అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్, కోటి వెంకటరాముడు, డీలర్ రషీదు, మహేంద్ర, రంగా, వార్డు మెంబర్లు గుంత తిరుపతి, బాలపెద్దయ్య, మేకల రామచంద్ర, సతీష్‌నాయుడు, పండు శ్రీరాములు, పామిశెట్టి నాగరాజు, కోట చౌదరి, చిట్టెం రెడ్డి బాలరెడ్డి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

పుట్లూరు, జూలై 21 ప్రభాతవార్త

అనంతపురంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సమైక్య రాష్ట్ర సదస్సులో రజకులు పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ పార్టీ అనుబంధ సంఘమైన చేతివృత్తిదారుల సమైక్య మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఈ సదస్సు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ సదస్సులో రజకులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన హక్కులు కాపాడుకొనుటకు అలాగే రజకుల సమస్యలపై రాష్ట్ర సదస్సులో చర్చల్లో పాల్గొనడానికి చేతివృత్తిదారుల సమైక్య మండల అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, ఓబులేసు ఆధ్వర్యంలో అనంతపురం జరుగు రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సుకు మండలంలోని అరకటవేముల, కడవకల్లు, చింతకుంట, కొండాపురం నుండి రజకులు పుట్లూరు మండల కమిటీ సభ్యులు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మడుగుపల్లి ఓబులేసు, చిన్నబాలప్ప, సుదర్శన్, శ్రీనివాసులు, శేఖర్, ఈశ్వరయ్య, కులశేఖర్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన దూదేకుల బాబయ్య



సజ్జలను కలిసిన బాబాయ్య

తాడిపత్రిఅర్బన్, జూలై 21 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణానికి చెందిన వక్ఫ్‌బోర్డు కోశాధికారి దూదేకుల బాబయ్య శుక్రవారం తాడేపల్లిలో ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాబయ్య మాట్లాడుతూ నూర్‌బాషా దూదేకుల కులస్తులకు షాదీతోఫాను 50 వేల రూపాయల నుండి లక్ష రూపాయలకు వర్తింపచేసిన సందర్భంగా ముందుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 200 మందికిపైగా కళ్యాణమస్తు ద్వారా 50 వేలు మాత్రమే లబ్ది పొందిన వారికి కూడా తిరిగి షాదీతోఫా కింద 50 వేల రూపాయలను అందచేయాలని కోరారు. దూదేకుల కులస్తులను మైనార్టీలుగా గుర్తించి విద్యార్థులకు స్కూల్ సర్టిఫికెట్లలో ముస్లిం దూదేకుల అని ప్రధానోపాధ్యాయులు వ్రాయు విధంగా అధికారులకు జిఒ మంజూరు చేయించాలని కోరారు. భవిష్యత్తులో వెనుకబడిన దూదేకుల కులానికి రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ప్రాధాన్యత కలిగించాలని ఆయన కోరారు. ఈ విషయాన్ని సజ్జల రామకృష్ణారెడ్డి ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తమ కులానికి న్యాయం జరిగేలా చూడాలని బాబయ్య కోరారు.

## ఎంపిడిఒ కార్యాలయంలో సమీక్షసమావేశం



సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎంపిడిఒ యోగానందరెడ్డి

పుట్లూరు, జూలై 21 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పశుసంవర్థకశాఖ, వెలుగు సిబ్బందితో ఎంపిడిఒ యోగానందరెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో చేయూత, ఆసరా పథకం కింద లబ్ది పొందిన పశు సంపద వున్న మహిళలకు వారికి సంబంధించిన బ్యాంకుల ఖాతాల ద్వారా పశుకిసాన్ క్రెడిట్ కార్డులు ఇప్పించడం జరుగుతుందన్నారు. సదరు కార్డు ద్వారా 50 వేల నుండి లక్ష రూపాయల వరకు పశు సంపద పశుపోషన నిమిత్తం అందచేయడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో సంబంధిత వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్లు ప్రభుత్వం ద్వారా ఆసరా, చేయూత పథకాల కింద లబ్ది పొందిన వారి ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించి దరఖాస్తులు పూర్తి చేసి శనివారం సాయంత్రంలోపు దరఖాస్తులు పశుసంవర్ధకశాఖకు అప్పగించాలని అవగాహన కల్పించారు. పుట్లూరు మండలంలో 217 మంది చేయూత లబ్దిదారులు పాడి పశువులు, గొర్రెలు, మేకలు ఎంపిక చేసుకున్నారన్నారు. ఈ లబ్దిదారులతో దరఖాస్తులు సేకరించి పశుసంవర్ధకశాఖ ద్వారా బ్యాంకులకు పంపాలన్నారు. బ్యాంకు వారు వెరిఫై చేసి వారికి పశు కిసాన్ క్రెడిట్ కార్డులు పికెసిసి జారీ చేస్తారని ఆయన తెలియచేశారు.

## ఉరి వేసుకుని గర్భవతి ఆత్మహత్య



మృతి చెందిన పఠాన్‌హుస్సేన్‌బీ

యాడికి, జూలై 21 ప్రభాతవార్త

మండలంలోని రాయలచెరువు గ్రామానికి చెందిన పఠాన్‌హుస్సేన్‌బీ (28) శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు. భర్త నన్నేసాహెబ్‌తో గత 8 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి 3 సంవత్సరాల కుమారుడు వున్నాడు. ప్రస్తుతం నాలుగు నెలల గర్భవతిగా వుంది. కొన్ని రోజులుగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నారని ఆరోగ్యం సరిగాలేక శుక్రవారం భర్తను బయటకు వెళ్లి జ్యూస్ తీసుకుని రమ్మని చెప్పి ఇంటిలో వున్న హుక్కికి చీరతో ఉరి వేసుకుని వుండడంతో చుట్టుపక్కల వారి సహాయంతో ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

## అలారఖ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రజకులకు ఉచిత బోరు



పెన్నానదిలో బోరు వేస్తున్న దృశ్యం



నగదు అందచేస్తున్న దృశ్యం

తాడిపత్రిఅర్బన్, జూలై 18 ప్రభాతవార్త

పట్టణంలోని అల్లారఖ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కలిగర్ మహమ్మద్ అయూబ్ రజకుల కోసం పెన్నానదిలో ఉచితంగా బోరు వేయించారు. గత కొంతకాలంగా రజకులు దుస్తులు ఉతికేందుకు ఇబ్బందులు పడుతుండడంతో వారికి బోరు వేయించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు కొంతకాలంగా నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని తన దృష్టికి రావడంతో బోరు వేయించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ముందు తాడిపత్రి నియోజకవర్గం ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలను అల్లారక వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చేపడతామన్నారు. బోరు వేయించడం పట్ల రజకులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా వారికి 30 వేల రూపాయల నగదు అందచేశారు. ఈ కార్యక్రమంలో అల్లారఖ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అయూబ్‌బాష, నజీర్‌బాష, ఎంఎస్ బాష, రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర యువజన అధ్యక్షులు డివి కుమార్, వెంకటేష్, నాగరాజు, పెద్దయ్య, మూర్తి, శివకుమార్, బాలన్న, చంద్ర, కొండయ్య, సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మంపల్లిలో జగనన్న సురక్ష



దృవీకరణపత్రాలను అందచేస్తున్న అధికారులు

యల్లనూరు, జూలై 21 ప్రభాతవార్త

మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలోని సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తహశీల్దార్ సుమతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు ఒక గొప్ప వరమని, గతంలో సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రంలో కార్యాలయాల చుట్టూ తిరిగేవారని ప్రస్తుతం అలా కాకుండా వారి ఇంటికే వచ్చి 11 రకాల ఉచిత సర్వీసులు అందిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా దాదాపు 212 మంది లబ్దిదారులకు ఉచితంగా దృవీకరణపత్రాలను అధికారులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వీర్రాజు, ఇఒఆర్‌డి విజయశేఖర్‌నాయుడు, ఏపిఎం షబ్బీర్‌బాష, డాక్టర్ నాగశ్రీ, ఉపసర్పంచు భాస్కర్‌రెడ్డి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## మండల వ్యాప్తంగా సమగ్ర ఓటర్ సర్వే



నాయకులతో మాట్లాడుతున్న తహశీల్దార్ సుమతి

యల్లనూరు, జూలై 21 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సుమతి శుక్రవారం రాజకీయ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగేలా చూడడం, ఇంటింటికి బిఎల్‌ఒలు ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్ల గుర్తింపు, మృతి చెందిన వారి ఓట్ల తొలగింపు, డోర్ నెంబర్ లేకుండా వున్న ఒకే డోర్ నెంబర్‌పై పదుల సంఖ్యలో వున్న ఓట్ల పరిశీలన, మండల వ్యాప్తంగా 40 పోలింగ్ కేంద్రాలు వున్నాయని, ఒక బూతుకు 1500 ఓట్లకు మించి వుంటే కొత్త బూతుకు సిఫారస్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## మండలంలో వైసిపి పార్టీ బలోపేతానికి కృషి



పాల్గొన్న వైసిపి నాయకులు

అమడగూరు, జూలై 21 ప్రభాతవార్త

అమడగూరు మండలంలో వైసిపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైసిపి సిఇసి సభ్యులు డాక్టర్ కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి, యువనాయకులు కొత్తకోట చక్రధరరెడ్డిలు తమదైనశైలిలో గ్రామాల్లో కలియతిరిగారు. 2024 ఎన్నికల్లో వైసిపి పార్టీని బలపరిచి మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించాలని విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చినగానపల్లి, నర్సన్నగారిపల్లి, ఆకులవారిపల్లి, చెరువుముందరపల్లిలో వారు పర్యటించారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ శేషువర్ధన్‌రెడ్డి, వెంకటరెడ్డి, డాక్టర్ సురేష్‌రెడ్డి, మాజీ కన్వీనర్ రాజారెడ్డి, నర్సన్నగారిపల్లి కృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, ఆకులవారిపల్లి హనుమంతరెడ్డి, సదులవాండ్లపల్లి జయరాం, చెరువుముందరపల్లి నటరాజ్, హరినాథ్‌రెడ్డి, డీలర్ చెన్నుడు, మోహన, రామకేశవ, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.



## పిన్నవయసులోనే రిటైర్మెంట్

### పాక్ క్రికెటర్ ఆయేషా నసీమ్

**కరాచి:** పిన్నవయసులోనే పాక్‌జట్టులో చోటు సంపాదించి స్టార్‌గాఎదిగిన ఆయేషా నసీం షాకింగ్ నిర్ణయం తీసుకుంది. 18ఏళ్ల వయసులోనే కెరీర్‌కు గుడ్‌బై చెపుతున్నట్లు ప్రకటించింది. తను ఇస్లాం నిబంధనలకు అనుగుణంగా జీవించాలని అనుకుం టున్నట్లు తెలిపింది. ఇదే అంశాన్ని పాక్‌క్రికెట్ బోర్డుకుకూడా ఆమె తెలిపింది. పాక్‌లో మహిళా క్రికెట్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈక్రమంలో ఆమె భవిష్యత్తు స్టార్‌గా ఎదిగే అవకాశం ఉందని చాలామంది కితాబునిచ్చారు. తనుమాత్రం క్రికెట్‌ను వదిలి ఇస్లాంకు అనుగుణంగా జీవించాలని అనుకుం టున్నట్లు ఆయేషా షాకింగ్‌నిర్ణయం ప్రకటించింది. తన ట్యాలెంట్‌తో పాకిస్తాన్‌మహిళ జట్టుకు ఎంపికయింది. 2020లో ఈ టీమ్ తరపున అరంగేట్రంచేసిన ఆమె ఇప్పటివరకూ 30 టి20లు నాలుగు వన్డేల్లో పాక్‌కు ప్రాతినిధ్యం వహించింది.

# రెండోరోజు జోరుతగ్గిన భారత్

## రెండో టెస్ట్‌లో ఆరువికెట్ల నష్టానికి 373 పరుగులు



**పోర్టావుప్రిన్స్:** వెస్టిండీస్ భారత్ మధ్యజరుగుతున్న రెండో టెస్టుమ్యాచ్‌లో రెండోరోజు ఆటప్రారంభం అయింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఓవర్‌నైట్ స్కోరను 288/4తో ఆటను కొనసా గించింది. తొలిరోజు తొలిసెషన్‌లో భారత్ ఆధి పత్యం చెలాయించింది. రెండోసెషన్‌నుంచి మాత్రం జోరు కొనసాగించలేకపోయింది. రెండోరోజు భారత్‌స్కోరు ఆరు వికెట్ల నష్టానికి 373 పరుగులు చేసింది. తొలిసెషన్‌లో దూకుడు చూపించిన విరాట్‌కోహ్లీ 121పరుగులు వ్యక్తిగత పరుగులవద్ద రనౌట్ అయ్యాడు. కాసేపటికే జడేజా 61 పరు గులు చేసి వెనుదిరిగాడు.

108 ఓవర్లు పూర్తికాగా ప్రస్తుతం క్రీజులో ఇషాన్ కిషన్ 18 పరుగులు, అశ్విన్ ఆరుపరుగులతో కొనసాగారు. 104వ ఓవర్‌లో రోచ్‌వేసిన బంతిని ఎదుర్కొనే క్రమంలో వికెట్ కీపర్ డిసిల్వాకి క్యాచ్ ఇచ్చి జడేజా 61 పరుగులవద్ద ఔట్ అయ్యాడు. అంపైర్‌మొదట నాటౌట్ ప్రకటించగా విండీస్ డిఆర్ఎస్‌కు వెళ్లింది. ఫలితంగా ఔట్‌అని ప్రకటిం చారు. సెంచరీ బాదిన విరాట్‌కోహ్లీ 121పరుగుల వద్ద రనౌట్ అయ్యాడు. వారికన్ వేసిన 99వ ఓవర్‌లో రనౌట్ అయ్యాడు.

స్ట్రైక్‌లోఉన్న కోహ్లీ సింగిల్‌కు ప్రయత్నించగా విండీస్ ఆటగాడు జోసెఫ్ నాన్‌స్ట్రైక్ ఎండ్‌లో వికెట్‌కు నేరుగా బంతిని విసిరాడు. శతకం దాటి భారత్‌కు మంచి స్కోరు అందించిన కోహ్లీ పెవిలి యన్‌కు చేరడంతో ఇషాన్‌కిషన్ బ్యాటింగ్‌కు వచ్చాడు. రెండోరోజు ఆటలో కోహ్లీ శతకంతోపాటు రవీంద్రజడేజా అర్థశతకంతో మెరుపులు మెరి పించారు.



## యాషెస్ సిరీస్‌లో చెలరేగిన ఇంగ్లండ్ బ్యాటర్లు

### తొలి ఇన్నింగ్స్‌లో 275 పరుగుల ఆధిక్యం

**న్యూఢిల్లీ,జులై 21:** యాషెస్ నాలుగో టెస్టులో ఇంగ్లండ్ బ్యాటర్లు చెలరేగారు. ఒకరితర్వాత ఒకరు భారీ షాట్లతో ఆసీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. దీనితో ఆజట్టు తొలి ఇన్నింగ్స్‌లోభారీ ఆధిక్యం సాధించింది. ఓల్డ్‌ట్రాఫోర్డ్ వేదికగా జరుగుతున్న ఈ టెస్టులో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 317 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కువచ్చిన ఇంగ్లండ్‌కు అనుకున్న ఆరంభం దక్కలేదు. బెన్‌డకెట్ ఒకే ఒక్కపరుగుచేసిక్రీజులో నిలవలేదు. మరో ఓపెనర్ జాక్‌క్రాలీ 189 పరుగులతో ధనాధన్ ఆటతో రెచ్చిపోయాడు. ఆతని అండతో మొయిన్ ఆలీ 54, జోరూట్ 84పరుగులతోరాణించారు. తర్వాత వచ్చిన కెప్టెన్ బెన్‌స్టోక్స్ 51, హ్యారీబ్రూక్ 61 కూడా ఆడారు. చివరిలో టెయిలెండర్ల సాయంతోజానీ బెయిర్‌స్టో 99 పరుగులకు నాటౌట్‌గా నిలిచి విశ్వరూపంచూపించాడు. బౌండరీలు బాదిన ఆతడు ఆసీస్ బౌలర్లకు చుక్కలుచూపించాడు. ఆతడిని ఔట్‌చేయడం ఆసీస్ వల్లకాలేదు. ఎంతమంది బౌలర్లను మార్చినా ఫీల్డింగ్‌సెట్‌చేసినా బెయిర్‌స్టో దూకుడుకు మాత్రం కళ్లెం వేయలేకపోయారు. చివరిలోజేమ్స్ ఆండర్సన్ ఐదు పరుగులకే ఔట్‌చేయడంతో బెయిర్‌స్టో సెంచరీపూర్తిచేయలేదు. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్‌ఐదు వికెట్లతో చెలరేగాడు. ఆతనితోపాటు కామరూన్ గ్రీన్ మిచెల్‌స్టార్క్ చెరో రెండు వికెట్లుతీసారు. ఇంగ్లండ్ బ్యాటర్లు ధాటిగా ఆడటంతో తొలి ఇన్నింగ్స్‌లో జట్టు 592 పరుగులకు ఆలౌట్ అయింది. ఆసీస్‌పై 275 పరుగుల ఆధిక్యంలోనిలిచింది. ఈ స్కోరు అధిగమించి మ్యాచ్ గెలవడం ఆసీస్‌వల్ల అయ్యేపనికాదని ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు.

## విండీస్‌పై మూడోసారి కోహ్లీ సెంచరీ



**పోర్టావుప్రిన్స్:** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్‌కోహ్లీ మంచి ఫామ్‌లో ఉన్నాడు. విండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో చెలరేగాడు. మొత్తం 101 పరుగులు చేసాడు. తొలిరోజు 87 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రెండోరోజు ఆటను ప్రారంభించిన విరాట్ సెంచరీ పూర్తిచేసాడు. విండీస్‌పై ఇది మూడో సెంచరీ తన కెరీర్ లోనే 500వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న విరాట్‌సెంచరీతో చిరస్మరణీయం చేసుకోవడంవిశేషం. ఇప్పటికే అత్యధిక టెస్టు పరు గుల్లో వీరేంద్ర సెహ్వాగ్‌ను అధిగమించిన విరాట్ ఇపుడు ఆసీస్ మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్ 8643 పరుగులుకూడా దాటేశాడు. విరాట్‌కోహ్లీ 8655 పరుగులతో కొనసాగుతున్నాడు. టెస్టు కెరీర్‌లో ఈ సెంచరీతోకలిపి విరాట్‌ఖాతాలోకి 29 చేరాయి. దీనితో న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్‌కేన్ విలియ మ్సన్ 28,మైకేల క్లార్క్ 28, హాషీమ్ ఆమ్లా 28 టెస్టుల మార్క్‌ని అధిగమించాడు. అలాగే సెంచరీల జాబితాలోక్రికెట్ దిగ్గజం సర్‌డాన్‌బ్రాడ్‌మన్ 29తో కలిసి సమంగా నిలిచాడు. బ్రాడ్‌మన్‌కేవలం 52 టెస్టుల్లోనే 29 సెంచరీలు బాదగా విరాట్‌మాత్రం 11 టెస్టులు తీసుకున్నాడు.

## అతడిబౌలింగ్ స్పీడ్‌గన్ కంటే వేగం

### ఆసీస్ మాజీ పేసర్ జాసన్ గిలెస్పీ



**ముంబయి:** స్టార్ క్రికెటర్ స్పీడ్‌గన్ జస్‌ప్రీత్‌బుమ్రా సేవలు మిస్‌కావడంపై ఆసీస్‌మాజీ పేసర్ జాసన్ గిలెస్పీ స్పందిం చాడు. ఇలాంటి పేసర్ జట్టులో ఉంటే ఎంతోప్రయోజనకరంగా ఉంటుందని, ఆతడు స్పీడ్‌గన కంటే వేగంగా బౌలింగ్ చేస్తా డన్నాడు. గాయాలనుంచి కోలు కుని రావడం పేసర్లకు సవాల్‌తో కూడుకున్నదేనన్నారు. బుమ్రా జట్టులో లేకపోవడం టీమిండి యాకు పెద్ద షాక్ అన్నాడు. ప్రపంచంలోనే ఉత్తమ బౌలర్లలో బుమ్రా ఒకడు. ప్రధాన బౌలర్‌ను కోల్పోవడం ఏజట్టుకైనా నష్టమే. మరీ ముఖ్యంగా బుమ్రా వంటి బౌలర్‌సేవలను భారత్ ఏడాదిపాటుమిస్ అయింది. ప్రత్యేకమైన శైలి కలిగిన బుమ్రా స్పీడ్‌గన్‌కంటే వేగంగా బంతులను సంధిస్తాడు. ప్రపంచంలోని చాలామంది బ్యాటర్లనుంచి సేకరిం చిన వివరాలప్రకారం బుమ్రా బౌలింగ్ ఎదుర్కోనడం చాలా కష్టం. గన్‌నుంచి వచ్చే బులెట్‌కంటే వేగంగా ఆతడి బంతి వస్తుందనేది వారి అభిప్రాయం ఇలాంటి బౌలర్లు ఉండటం జట్టుకు ఎంతో బలం. త్వరలోనే ఆతడు కోలుకుని పూఐర్తిస్థాయిలో బరిలోకి వస్తాడని అశిస్తున్నట్లు చెప్పాడు.

## 211 పరుగులకే ఎమర్జింగ్ ఇండియా ఏ-జట్టు ఆలౌట్



**కొలంబో:** ఎమర్జింగ్ ఆసియాకప్ వన్డే టోర్నమెంట్‌లోభాగంగా బంగ్లదేశ్‌తో జరుగుతున్న సెమీఫైనల్‌లో భారత్‌ఏ జట్టు ఇన్నింగ్స్‌ముగిసింది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 49.1 ఓవర్లు ఆడి 211 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ యష్‌ధుల్ 66 పరుగులతో అర్థసెంచరీచేస్తే ఓపెనర్లు సాయి సుదర్శన్ 21, అభిషేక్‌శర్మ 34 పరుగులతో ఔట్ అయి నిరాశపరి చారు. బ్యాటింగ్‌ప్రారంభాఇంచిన భారత్ తొలుత నిలకడగానే ఉన్నా జట్టుస్కోరు 29 పరుగులవద్ద హసన్ షకీబ్ వేసిన ఏడో ఓవర్‌చివరి బంతికి భారీ షాట్ ఆడిన సాయిసుదర్శన్ అక్బర్ ఆలీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తొలిడౌన్‌లో వచ్చిన నికన్‌జోస్ 17పరుగులు, మరో ఓపెనర్ అభిషేక్‌శర్మ కలిసి ఇన్నింగ్స్ సర్దుబాటుచేసారు. కానీ ఒక్క ఓవర్ వ్యవధిలోనే ఇద్దరూ పెవిలియన్ బాటపట్టారు. దీనితో ఒక్కసారిగా జట్టు కష్టాల్లోకి వెళ్లింది. తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ యష్‌ధుల్ బాధ్యతాయుత ఇన్నింగ్స్ నిర్మించాడు. క్రీజులో నిలదొక్కు కుంటూ ఆడాడు. వీలు చిక్కినపుడల్లా బౌండరీలు బాదుతూ స్కోరును ముందుకు తీసుకెళ్లాడు. అయితే రిఫన్ మండల్ వేసిన 49.1వ బంతికి భారీ షాట్ ఆడి రకీబుల్ హసన్‌కు క్యాచ్‌ఇచ్చి వెనుదిరిగాడు. ధుల్ నిలకడగా ఆడినా ఆవలి ఎండ్‌లో వచ్చిన నిషాంత్ సింధు ఐదు, రియాన్‌పరాగ్ 12, ధ్రువ్‌ఒకటి, హర్షిత్‌రాణా తొమ్మిది మనవ్‌సుతార్ 21, మంగార్గేకర్ 15 తక్కువపరుగులకే వెనుదిరగడంతో భారత్ 211పరుగులకే రిమితం అయింది. బంగ్లా బౌలర్లలో మెహదీ హసన్, హసన్ షకిబ్, హాకీబుల్ హసన్ తలో రెండువికెట్లు తీయగా సైఫ్ హస్సన్ సౌమ్య సర్కార్, రిపన్ మండల్ ఒక్కో వికెట్ తీసారు.

# డీమార్ట్ చేతికి హెల్త్ అండ్ గ్లో

**బెంగళూరు, జులై 21:** అవెన్యూ సూపర్‌మార్ట్స్ కింద డీమార్ట్ పేరుతో రిటైల్ వ్యాపారాన్ని నడుపుతున్న రాధాకిషన్ దమానీ, బెంగళూరుకు చెందిన బ్యూటీ అండ్ పర్సనల్ కేర్ రిటైల్ చైన్ హెల్త్ అండ్ గ్లో ను కొనుగోలు చేశారు. రాజన్ రహేజా, హేమేంద్ర కొఠారి నుంచి దమానీ ఈ డీల్ పూర్తి చేశారు. ఈ డీల్ రూ.700-750 కోట్లకు జరిగినట్లు విషయం తెలిసిన వ్యక్తుల ద్వారా వెల్లడైంది. దీంతో బ్యూటీ ఉత్పత్తుల రంగంలో కూడా దమానీ అడుగుపెట్టారు. బ్యూటీ అండ్ పర్సనల్ కేర్ రిటైల్ చైన్ హెల్త్ అండ్ గ్లో, బాంబే స్వదేశీ స్టోర్స్ తర్వాత రాధాకిషన్ దమానీ చేసిన రెండవ పెద్ద డీల్. దమానీ 2015లో బాంబే స్వదేశీ స్టోర్స్‌ని కొనుగోలు చేసిన విషయం విదితమే. హెల్త్‌అండ్ గ్లో 1997లో ప్రారంభమైంది. కంపెనీ తన తొలి ఫిజికల్ స్టోర్ చెన్నైలో ప్రారంభించింది.




అప్పటి నుంచి హెల్త్ అండ్‌గ్లో బెంగళూరు, మంగళూరు, పుణె, ముండో, కొచ్చి, కోల్‌కతా, భోపాల్, భువనేశ్వర్, హైదరాబాద్‌లలో మొత్తం 175 స్టోర్‌ల ను ప్రారంభించింది. ప్రస్తుతం రాధాకిషన్ దమానీ నికర విలువ రూ.1,66,949 కోట్లుగా ఉంది. జూన్ 2023 త్రైమాసికం వరకు దమానీ 14 కంపెనీల షేర్లలో పెట్టుబడులను కలిగి ఉన్నట్లు కార్పొరేట్ షేర్ హోల్డింగ్ డేటా వెల్లడించింది. వివిఎస్‌టి ఇండస్ట్రీస్‌లో దమానీకి గరిష్ట వాటా ఉంది. వివిఎస్‌టి ఇండస్ట్రీస్‌లో ఆయన అతిపెద్ద వాటాదారుగా ఉన్నారు. ఇదే క్రమంలో ఇండియా సిమెంట్స్‌లో 21శాతం వాటా కలిగి ఉన్నారు. రాధాకిషన్ దమానీ ఇండియా సిమెంట్స్‌లో అతిపెద్ద పబ్లిక్ పెట్టుబడిదారు. అలాగే దమానికి టాటా గ్రూప్ చైన్ ట్రెంట్‌లో కూడా వాటాలున్నాయి.

## చైనాకు చెక్ పెట్టేందుకు భారత్ 'పవర్'!

**చైనా, జులై 21:** ఆగ్నేయాసియా దేశాల్లో చైనా పలుకుబడికి చెక్ పెట్టేందుకు భారత్ సరికొత్త 'పవర్‌వ్యూహాన్ని' సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో భారత్ పెంచుకొంటున్న పునరుత్పాదక విద్యుత్ వనరులను ఇందుకోసం వాడు కోవాలని చూస్తోందని ఈ వ్యవహా రంతో సంబంధం ఉన్న కీలక వ్యక్తులు వెల్లడించారు. ఈ విద్యుత్‌ను మయన్మార్, థాయ్‌లాండ్ మీదుగా ఆయా దేశాలకు సరఫరా చేయాలని భావిస్తున్నారు. ఈ గ్రిడ్ అనుసంధా నతను పూర్తి చేసేందుకు ఎంతలేదన్నా కనీసం నాలుగేళ్లు పడుతుందని అంచనా. భారత్‌ద పొరుగు దేశాలతో సన్నిహిత సంబంధాలను మరింత పెంచుకోవాలని ప్రయత్నాలు

పారిశ్రామిక రంగానికి



ఆయువుపట్టైన విద్యుత్తును ప్రత్యేక గ్రిడ్ అనుసంధానం ద్వారా ఆయా దేశాలకు సరఫరా చేయాలని భావిస్తోంది. ముఖ్యంగా

చేస్తోంది. ఇందుకు తాజాగా గోవాలో జరుగుతున్న జీ-20 మంత్రివర్గ స్థాయి సదస్సులను వేదికగా వాడుకొంటోంది. పవర్‌గ్రిడ్ అనుసంధానంపై తాజా గా వివిధ దేశాల ప్రతినిధులతో చర్చలు జరుపు తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు పేర్కొ న్నారు. ముఖ్యంగా దీనిలో బ్యాంకుల మద్దతు, డెవలపర్ల పెట్టుబడిని సాధిం చడానికి జీ20 సభ్యుల నిర్ణ యాలు కీలకమని వారు పేర్కొన్నారు.

## శ్రీలంక అధ్యక్షుడితో అదానీ భేటీ..

**న్యూఢిల్లీ, జులై 21:** భారత పర్యటనలో ఉన్న శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘెతో అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ భేటీ అయ్యారు. ఈ మేరకు శ్రీలంక అధ్యక్షుడితో సమావేశమైనట్లు గౌతమ్ అదానీ ట్వీట్ చేశారు. ఈ భేటీలో కొలంబో పోర్టు అభివృద్ధి పనులతో పాటు శ్రీలంకలో అదానీ గ్రూప్ చేపడుతున్న ఇతర ప్రాజెక్టుల పురోగతి గురించి చర్చించినట్లు తెలిపారు. 'శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘెతో సమావేశం కావడం గొప్ప గౌరవం. ఈ భేటీలో శ్రీలంకలో అదానీ గ్రూప్ చేపడుతున్న పలు ప్రాజెక్టుల గురించి చర్చించడం జరిగింది. కొలంబో పోర్టు వెస్ట్ కంటైనర్ టెర్మినల్ అభివృద్ధి, 50 మెగావాట్ విండ్ ప్రాజెక్ట్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ గురించి చర్చించాం' అని గౌతమ్ అదానీ ట్వీట్‌లో పేర్కొన్నారు.



కొలంబో పోర్టు వెస్ట్ టెర్మినల్ అభివృద్ధికి సంబంధించి మార్చి 2021న శ్రీలంక అధికారులు అదానీ గ్రూప్‌నకు లేఖ రాశారు. శ్రీలంక పోర్టు అథారిటీ, జాన్ కీల్స్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లతో కలిసి అదానీ పోర్ట్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్స్ లిమిటెడ్ వెస్ట్ కంటైనర్ టెర్మినల్ నిర్మాణాన్ని చేపట్టనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో 35ఏళ్లలో డబ్ల్యూసిటిని అభివృద్ధి చేయనున్నారు.

# వాణిజ్యం

## మెక్‌డొనాల్డ్స్‌కు రూ.6 కోట్ల ఫైన్!

**వాషింగ్టన్, జులై 21:** చికెన్ నగెట్స్ తిందామని ఆశపడిన చిన్నారికి విపరీతమైన వేడిగా ఉన్న ఆహారం అందించినందుకు ప్రముఖ ఫుడ్ చెయిన్ కంపెనీ మెక్‌డొనాల్డ్స్‌కు భారీగా జరి మానా పడింది. ఈ ఘటన అమెరికాలో చోటు చేసుకొంది. ఒలివియా కారబల్లో అనే నాలుగేళ్ల చిన్నారి 2019లో ఫొరిడాలోని ఫోర్ట్ లాడర్‌డేల్ సమీపంలో మెక్‌డొనాల్డ్స్ డ్రైవ్ ఇన్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లింది. అక్కడ హ్యాపీ మీల్ ను కొనుగోలు చేసింది. దానిని తినేందుకు కారులో బాక్స్ తెరవగా విపరీతమైన వేడిగా ఉన్న ఓ నగెట్ ఆమె కాలుపై పడింది. ఈ ఘటనలో ఆమె కాలుకు స్వల్ప గాయమైంది. దీనికి తోడు ఆమె భయంతో చాలా సేపు ఏడుస్తూనే ఉంది. దీంతో ఒలివియా కుటుంబ సభ్యులు మెక్‌డొనాల్డ్స్‌పై ఫ్లోరిడాలోని న్యాయ స్థానంలో కేసు ఫైల్ చేశారు. కోర్టుకు చిన్నారి గాయం ఫొటోలు, ఆ సమయంలో పాప బాధతో ఏడుస్తున్న ఆడియోను అందిం చారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఆ చిన్నారికి గతంలో పడిన ఇబ్బందికి నాలుగు లక్షల డాలర్లు, భవిష్యత్తు కోసం మరో నాలుగు లక్షల డాలర్లు చెల్లించాలని మెక్‌డొనాల్డ్స్‌ను ఆదేశించింది. ఇది భారత కరెన్సీలో రూ.6.5 కోట్లకు సమానం. ఈ కేసులో మెక్‌డొనాల్డ్స్ తరపు లాయర్ స్పందిస్తూ కాలిన గాయం మూడు వారాల్లో తగ్గిన తర్వాత నొప్పి కూడా పోయిందని బాధితురాలి కుటుంబీకులు చెప్పారని వాదించారు. ఆమెకు 1.56 లక్షల డాలర్లు సరిపోతాయన్నారు. ఆ పాప ఇప్పటికీ మెక్‌డొనాల్డ్స్ ఔట్‌లెట్లకు వెళ్లి చికెన్ నగెట్లను తింటోందని చెప్పారు. కానీ న్యాయస్థానం మాత్రం 8,00,000 డాలర్లు చెల్లించాలని ఆదేశించింది. పాప తల్లి కోర్టు బయట మాట్లాడుతూ, ఈ తీర్పు కీలకమని తాము న్యాయస్థానం నుంచి ఏమీ ఆశించలేదని చెప్పారు.



## భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

### రూ.2 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

**ముంబై, జులై 21:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాల్లో ముగిసాయి. వారాంతంలో మార్కెట్లు ఊహించని నష్టాలను చవిచూశాయి. ప్రధానంగా ఐటి, మెటల్స్, ఎఫ్ఎంసిజి రంగాలు మార్కెట్లను కిందకు లాగాయి. మార్కెట్లు ముగిసే సమయంలో బెంచ్ మార్క్ సూచి సెన్సెక్స్ 888 పాయింట్లు క్షీణించి 66,684.26 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 234.20 పాయింట్లు క్షీణించి 19,745 పాయింట్ల వద్ద నిలిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ గరిష్టంగా 1000 పాయింట్ల నష్టాన్ని నమోదు చేసింది. ఈ సమయంలో ఇన్వెస్టర్ల సంపద దాదాపు రూ.2 లక్షల కోట్లు ఆవిరైంది. గత కొంతకాలంగా గరిష్టాలకు చేరు కున్న సూచి వారాంతంలో చతికిలపడింది. ఇదే సమయంలో నిఫ్టీ బ్యాంకు సూచి 46 పాయింట్లు, నిఫ్టీమిడ్‌క్యాప్ సూచి 136 పాయింట్ల మేర నష్టాలతో తమ ప్రయాణాన్ని ముగించాయి.



ప్రధానంగా మార్కెట్లో ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ షేర్లలో తీవ్రమైన అమ్మకాల ఒత్తిడి నెలకొనడం, రిలయన్స్ ఆదాయాలపై ఇన్వెస్టర్ల ఆందోళనలకు కారణమ య్యాయి. ఆదాయ అంచనాలు తగ్గించుకోవడం ఇన్వెస్టర్లను అమ్మకాల వైపు నడిపించింది. దీనికి తోడు అమెరికా కీలక సూచీలు ఆర్థిక మాంద్యం రావొచ్చని సూచించడం, అక్కడి మార్కెట్లు నష్టాల్లో ముగియడం భారత పెట్టుబడిదారులను ప్రభావితం చేస్తోంది.

## టెస్లాతో రూ.1.64 లక్షల కోట్లు మస్క్‌కు షాక్

**వాషింగ్టన్, జులై 21:** ట్విట్టర్, టెస్లా, స్పేస్‌ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్‌కు భారీ షాక్ తగిలింది. టెస్లా షేర్లు భారీ పతనంతో మస్క్ ఒక్కరోజే ఏకంగా 20.3బిలియన్ డాలర్ల అంటే భారత్ కరెన్సీలో దాదాపు రూ.1.64 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయారు. అయినప్ప టికీ ఇంకా ప్రపంచ కుబేరుల జాబితాలో మస్క్ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల ధరలను మరింత తగ్గించాలని యోచిస్తున్నట్లు టెస్లా ప్రకటించింది. వడ్డీరేట్లు ఇలాగే కొనసాగితే విద్యుత్ వాహనాల ధరలను మరింత తగ్గించకతప్పదని మస్క్ వెల్లడించారు. దీంతో గురువారం నాటి అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజీ ట్రేడింగ్‌లో ఈ కంపెనీ షేర్ల ధర భారీగా క్షీణించింది. షేరు ధర ఏకంగా 9.7శాతం కుంగింది. దీంతో ఒక్కరోజే ఎలాన్ మస్క్ సంపదలో 20.3 బిలియన్ డాలర్లు ఆవిర య్యాయి. ఈ యేడాది జూన్‌లో ఫ్రెంచ్ వ్యాపారవేత్త బెర్నార్డ్ ఆర్నాల్ట్ స్థాపించిన ఎల్‌విఎంహెచ్ షేర్లు భారీగా పతనమవ్వడంతో ఆయన సంపద తరిగి పోయింది. దీంతో మస్క్ మళ్లీ బెర్నార్డ్‌ను దాటి ప్రపంచ కుబేరుడి జాబితాలో అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. ఇప్పుడు టెస్లా షేర్ల నష్టంతో వీరిద్దరి సంపదల మధ్య వ్యత్యాసం తగ్గింది. అయినప్పటికీ మస్క్ ఇంకా తొలి స్థానంలో కొనసాగుతున్నారు.

## ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు లిస్టింగ్ జోష్

**ముంబై, జులై 21:** ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు ఐపిఓ శుక్రవారం మార్కెట్లోకి ఎంట్రీ ఇచ్చింది. తొలిరోజే ఈ ఐపిఓ బిఎస్ఇలో 59.80 శాతం ప్రీమియంతో రూ.39.95 వద్ద లిస్టింగ్ చేయ బడింది. అదే సమయంలో ఎన్ఎస్ఇలో కంపెనీ షేరు రూ.40 వద్ద లిస్టింగ్ జరిగింది. బ్యాంకింగ్ కంపెనీ తన షేర్లను రూ.23 నుంచి రూ.25 ధరకు విక్రయించింది. అయితే లిస్టయిన తొలిరోజే మార్కెట్లలో ఐపిఓకు మంచి స్పందన లభిస్తోంది. ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు ఐపిఓ 12 జులై నుంచి 14 జులై 2023 వరకు తెరవబడింది. పెట్టుబడిదారులు దీనికి సబ్‌స్క్రైబ్ చేసుకోవడానికి 3 రోజుల కాలంలో కొనుగోలు చేయడానికి లాట్ పరిమాణం 600 షేర్లుగా నిర్ణయించబడింది. అంటే ఐపిఓలో షేర్లను కొనుగోలు చేసేందుకు రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం రూ.15వేల పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. మూడు రోజుల సబ్‌స్క్రిప్షన్ సమయంలో కంపెనీ షేర్లు 133 సార్లు సభ్యత్వం పొందింది. ఐపిఓ జులై 14న 110.77 సార్లు సబ్‌స్క్రిప్షన్ చేయబడింది. రిటైల్ విభాగంలో 78.38 శాతం, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ కేటగిరీలో 135.71 రెట్లు నాన్-ఇన్‌స్టిట్యూషనల్ కేటగిరీలో 88.74 రెట్లు సబ్‌స్క్రిప్షన్ ఐపిఓ పొందింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot no B11 & B12, Industrial Park, Bellary Road, Anantapur. Phone :9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No. 70088/97, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/18-20 Air Surcharge: Delhi : 40 Ps.